హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.120	180	200
సూర్యాపేట	రూ.95	140	170
నల్లగొండ	రూ.100	145	180

ఉష్ణోగ్రత గరిష్ఠం 36.0 । కనిష్ఠం 19.4



సుందరీకరణకు నోచనున్న మూసీ

కరువు నేలపై కరుణ

కరువు ప్రభావిత ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించేందుకు వీలుగా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుందని బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. ప్రభుత్వం సాగునీటి కాల్వలతోపాటు మూసీ పరివాహక ప్రాంతాల్లోని కాల్వల పునరుద్ధరణకు తగిన చర్యలు తీసుకుంటామని బడ్జెట్ ప్రసంగంలో వివరించారు. రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ప్రకటించారు. ప్రాధాన్యతా క్రమంలో ఏ, బీ కేటగిరీలు విభజించారు.

- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

- సాగు, తాగునీటిని అందిస్తామని ప్రభుత్వం ప్రకటన
- మూసీ ప్రాజెక్టు కింద కాల్వల పునరుద్ధరణ
- సాగునీటి రిజర్వాయర్ల ద్వారా నీటి సరఫరా
- యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ప్రత్యేక బోర్డు
- రాష్ట్ర బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి వెల్లడి

తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టును సేద్యంలోకి తీసుకు రావలన్నది ప్రభుత్వ ఉద్దేశమని, నల్లగొండ, యాదాద్రి భువనగిరి జిల్లాలోని కరువు ప్రభావిత ప్రాంతాలకు సాగునీటిని అందించేందుకు వీలుగా ఉదయ సముద్రం బ్రాహ్మణవెల్లెంల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును ప్రారంభించామని వివరించారు. ఉదయం సముద్రం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి 6.70 టీఎంసీల నీటిని బ్రాహ్మణవెల్లెంల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు లిఫ్ట్ చేస్తామని, ఈ ప్రాజెక్టు ద్వారా 94 గ్రామాల్లో లక్ష ఎకరాలకు సాగునీరు, ఫ్లోరైడ్‌తో బాధపడుతున్న మునుగోడుతోపాటు పలు నియోజకవర్గాల్లోని 107 గ్రామాలకు తాగునీటిని అందిస్తారు.

టీటీడీ తరహాలో బోర్డు

ప్రజల మనోభావాలను గౌరవిస్తూ యాదాద్రిని తిరిగి యాదగిరిగుట్టగా ప్రభుత్వం ప్రకటించింది. యాదగిరిగుట్ట దేవాలయ విమానగోపురానికి మొత్తం 65 కిలోల బంగారంతో తాపడం పనులు పూర్తిచేసి, సంప్రోక్షణ మహోత్సవాన్ని నిర్వహించామన్నారు.టీటీడీ బోర్డు తరహాలో యాదగిరిగుట్ట టెంపుల్ బోర్డును ఏర్పాటు చేయనున్నామని ప్రకటించారు. అయితే యాదగిరిగుట్ట దేవాలయ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులేమీ కేటాయించలేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు మౌలిక వసతులు కల్పిస్తామని ప్రకటించింది...

- మిగతా 7వ పేజీలో...



'గంధమల్ల'కు నిధులు కేటాయించేనా..?

గంధమల్ల రిజర్వాయర్ నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించలేదు. సాగునీటి ప్రాజెక్టులను చేపట్టేందుకు ప్రభుత్వం ఏ, బీ కేటగిరీలు విభజిస్తున్నట్లు బడ్జెట్‌లో ప్రకటించింది. అయితే ఈ రిజర్వాయర్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయనుందా? లేదా? అన్నది స్పష్టం కాలేదు. ఈ రిజర్వాయర్ నిర్మాణంపై 2019 ఫిబ్రవరిలో ప్రభుత్వం భూసేకరణ నోటిఫికేషన్ జారీచేసింది. ఈ రిజర్వాయర్‌ను మొదటగా 9.8టీఎంసీలుగా నిర్మించేందుకు ప్రణాళికను సిద్ధం చేశారు. ఈ మేరకు 232 ఎకరాల అటవీ భూమిని సేకరించింది. నిర్మాణ పనులు ఓ కంట్రాక్టర్‌కు అప్పగించింది. ప్రధాన కాల్వ, డిస్ట్రిబ్యూటరీలకు 4,162 ఎకరాల భూమి అవసరం కాగా, రిజర్వాయర్ వల్ల 4,027 ఎకరాల భూమితోపాటు 1,568 ఇళ్లు ముంపునకు గురవుతున్నాయి. ఈ రిజర్వాయర్ నిర్మాణంతో గంధమల్ల, బచ్చలగూడెం, ఇందిరానగర్ గ్రామాలు పూర్తిగా ముంపునకు గురవుతుండగా వీరారెడ్డిపల్లిలో దాదాపు 1800 ఎకరాల వరకు భూములు కోల్పోయే అవకాశం ఉందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. నిర్వాసితుల నిరసన వ్యక్తం చేయడంతో 4.28 టీఎంసీలకు తగ్గించారు. దీంతో వీరారెడ్డిపల్లిని ముంపు నుంచి తప్పించారు. గత ప్రభుత్వంలో చేపట్టిన ప్రతిపాదనల్లో గంధమల్ల ముంపు గ్రామంగానే ఉంది. తాజాగా ప్రభుత్వం 1.5 టీఎంసీల సామర్థ్యానికి తగ్గించడంతో ముంపు గ్రామాలు లేకుండా...భూసేకరణ వేయి ఎకరాలకు పరిమితం చేసింది. రిజర్వాయర్ సామర్థ్యాన్ని తగ్గించడంతో త్వరలోనే పనులు చేపడ్తారని రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.



యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్

ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులకు ప్రాధాన్యం

- మే నెలాఖరుకు వైటీపీఎస్ ఐదు యూనిట్లలో విద్యుదుత్పాదన
- ప్రజల మనోభావాల మేరకు యాదగిరిగుట్టగా పేరుమార్పు
- ఉమ్మడి జిల్లా సాగునీటి ప్రాజెక్టులకు రూ.2161.29 కోట్ల నిధుల కేటాయింపులు

ఉపముఖ్యమంత్రి మల్లుభట్టివిక్రమార్క బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రాష్ట్ర ఆర్థికబడ్జెట్‌లో ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రాజెక్టులకు ప్రాధాన్యం దక్కింది. బడ్జెట్ ప్రసంగంలో జిల్లా ఇరిగేషన్ ప్రాజెక్టులు, మూసీకాల్వలు, యాదాద్రి థర్మల్ పవర్‌స్టేషన్, యాదగిరిగుట్ట ఆలయాల గురించి ఆర్థిక మంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. అదేవిధంగా రాష్ట్రస్థాయిలో ప్రభుత్వం తీసుకురాబోతున్న యంగ్‌ఇండియా స్కూళ్లు, ఏటీసీ కేంద్రాలు, నర్సింగ్, హెల్త్ సైన్స్ కాలేజీల్లోనూ జిల్లాకు ప్రాతినిధ్యం దక్కే అవకాశం కన్పించింది. జిల్లా ఇరిగేషన్ ప్రాజెక్టులకు రూ.2161.29 కోట్ల నిధులను ఈబడ్జెట్‌లో కేటాయించారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

నల్లగొండ,యాదాద్రి భువనగిరి జిల్లాల్లోని కరువు ప్రభావిత ప్రాంతాల్లో నీటిని అందించడానికి వీలుగా లక్ష ఎకరాల ఆయకట్టు, 107 గ్రామాలకు తాగునీరందించే లక్ష్యంతో బ్రాహ్మణ వెల్లంల ఎత్తిపోతల పథకం చేపట్టి వేగవంతంగా పనులు చేస్తున్నామని బడ్జెట్ ప్రసంగంలో డిప్యూటీ సీఎం ప్రత్యేకంగా ప్రస్తావించారు. అదేవిధంగా మూసీ పరిధిలోని బునాదిగానికాల్వ పునరుద్ధరణ పనులకు రూ.266.65కోట్ల నిధులతో పాలనా అనుమతులు ఇచ్చామని పేర్కొన్నారు. బునాదిగాని కాల్వతోపాటు పిలాయిపల్లి, ధర్మారెడ్డి పల్లి కాలువలకు ఈనిధులు వెచ్చిస్తామని పేర్కొన్నారు.

థర్మల్ పవర్‌ప్లాంట్‌లో అన్ని యూనిట్లలో విద్యుదుత్పాదన

దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద నిర్మిస్తోన్న నాలుగువేల మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్రాజెక్టుకు సంబంధించి గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన పర్యావరణ అనుమతులను తమ ప్రభుత్వం సాధించి ప్రాజెక్టు నిర్మాణానికి ఆటంకాలను తొలగించిందని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులో ఇప్పటికే రెండు యూనిట్లు సింక్రనైజ్ చేయగా, వచ్చే మే నెల నాటికి మొత్తం అయిదు యూనిట్లలో విద్యుదుత్పాదన చేపడతామని అసెంబ్లీలో డిప్యూటీ సీఎం పేర్కొన్నారు.

పెండింగ్ ఇళ్ల పూర్తికి నిధులు



ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని, ఇందు కోసం ప్రతీ ఇంటి కి రూ.4లక్షల నిధులు మం జూరు చేస్తామని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో దీని ప్రకారం 42వేల పేద కుటుంబాల కు ఇందిరమ్మ ఇళ్లు ఈ సంవత్సరం రాబోతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో నిర్మించి వదిలేసిన, పాక్షిక నిర్మాణాలున్న అన్ని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పూర్తిచేసి అర్హులైన పేదలకు అందిస్తామని పేర్కొనడమేకాకుండా అందుకు అవసరమయిన నిధులను కూడా ఈ బడ్జెట్‌లో కేటాయించడంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న డబల్ బెడ్‌రూమ్ ఇళ్లకు మోక్షం లభించబోతుంది.

ప్రతీ నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్



ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే నల్లగొండ, మునుగోడు నియోజకవర్గాలకు ఈ స్కూళ్లు రాగా, తాజాగా...

- మిగతా 7వ పేజీలో...

సాగునీటి ప్రాజెక్టులకు రూ.2161.29 కోట్లు

ఉమ్మడి జిల్లా నల్లగొండ జిల్లాకు సంబంధించిన కీలక సాగునీటి ప్రాజెక్టులకు ఈ బడ్జెట్‌లో ఆశించిన మేర నిధులు కేటాయించారు. ప్రధానంగా ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుకు అధికంగా నిధులు కేటాయించగా, అతి స్వల్పంగా డిండి ప్రాజెక్టుకు నిధులు దక్కాయి. ఏఎమ్మార్పీ, బ్రాహ్మణవెల్లంల లిఫ్టు, ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ లైనింగ్ వంటి పనులన్నింటికీ ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు నిధులనుంచే ఇవ్వనుండడంతో ఈ ప్రాజెక్టు కింద కేటాయింపులు ఎక్కువగా ఉన్నాయి.



డిండి ప్రాజెక్ట్

ఆదమరిస్తే కన్నీరే

చెరువులు, వాగుల్లో పొంచి ఉన్న ప్రమాదం



6

చిన్నారుల ఆటలు పెద్దలకు శాపాలుగా మారుతున్నాయి. తెలిసీ తెలియని వయస్సులో వారు చెరువులు, బావుల్లో ఈతలకంటూ వెళుతూ ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. అల్లారు ముద్దుగా పెంచుకున్న బిడ్డలు మృత్యువాత పడుతుండడంతో ఆ తల్లిదండ్రుల రోధన వర్ణనాతీతం. వేసవి మొదలైన సందర్భంలో తల్లిదండ్రుల్లో అప్రమత్తత కలిగించేందుకు ఈ కథనం...

(ఆంధ్రజ్యోతి-డిండి, బీబీనగర్)

హైవేపై ప్రమాదాల నివారణకు చర్యలు

- ఎస్పీ శరత్ చంద్ర పవార్



కట్టంగూరులోని నల్లగొండ క్రాస్ రోడ్డును పరిశీలిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

కట్టంగూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నెం.65 జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు తగు చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ శరత్ చంద్రపవార్ తెలిపారు. కట్టంగూరులోని నల్లగొండ క్రాస్ రోడ్డు, మండలంలోని చెర్వుఅన్నారం క్రాస్ రోడ్డుతో పాటు నకిరేకల్‌లోని నగేష్ హోటల్ వద్ద ఉన్న ప్రమాదకరమైన బ్లాక్ స్పాట్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. సర్వీస్ రోడ్లను పూర్తి చేయాలని, అన్ని జంక్షన్‌ల వద్ద లైట్లు, జీబ్రా క్రాసింగ్‌లైన్లు, సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని నేషనల్ హైవే అధికారులకు సూచించారు రోడ్డు ప్రమాద నివారణపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఎస్పీ వెంట నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి, శాలిగౌరారం సీఐ కొండల్ రెడ్డి, కట్టంగూరు ఎస్ఐ రవీందర్, ఎన్‌హెచ్ఏఐ రెసిడెంట్ ఇంజనీర్ కిషన్‌రావు, నాగకృష్ణ, జోగేందర చౌదరి, రాము, సంజీవ చౌదరి ఉన్నారు.

విలేజ్ రోడ్డు సేఫ్టీ కమిటీల ఏర్పాటు

వేములపల్లి : జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు గ్రామస్థాయిలో విలేజ్ రోడ్ సేఫ్టీ కమిటీల ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ శరత్‌చంద్రపవార్ అన్నారు. వేములపల్లి రైతు వేదికలో రోడ్డు ప్రమాదాల నివారణకు ఏర్పాటు చేసిన మిషన్ రోడ్ సేఫ్టీ, రోడ్ రూల్స్, రోడ్ రెస్పాన్సిబిలిటి అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతీ పౌరుడు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలన్నారు. ఈ సందర్భంగా మిర్యాలగూడ ప్రాంతీయ వైద్యశాల డాక్టర్ రోహిత్ సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఎస్పీ రాజశేఖర్‌రాజు, రూరల్ సీఐ పీఎన్‌డీ.ప్రసాద్, డీటీఆర్‌బీ సీఐ అంజయ్య, ఎస్ఐలు డి.వెంకటేశ్వర్లు, లక్ష్మణ్, శ్రీకాంత్‌రెడ్డి, ఏఎస్ఐలు నరసింహారావు, రమణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

నా పేరు హిందీలో రాయగలరా?

మీకు ఏ సబ్జెక్ట్ అంటే ఇష్టం » విద్యార్థులతో కలెక్టర్ ఇలాత్రిపాఠి » కస్తూర్బాగాంధీ పాఠశాలలో 30 నిమిషాలు పాఠాలు

త్రిపురారం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పిల్లలూ మీకు ఏ సబ్జెక్ట్ అంటే ఇష్టం. నా పేరును హిందీలో రాయగలరా..? అనగా కొంత మంది విద్యార్థినులు రాసి చూపించారు. దాంతో విద్యార్థులకు చాక్లెట్లు అందజేశా రు. ఆమె ఏ ఉపాధ్యాయురాలో అనుకుంటున్నారా..? కాదండీ.. సాక్షాత్తు కలెక్టర్ ఇలా త్రిపాఠి. మండలంలోని కంపసాగర్ కస్తూర్బాగాంధీ పాఠశాలను బుధవారం సందర్శించారు. పదో తరగతిలో విద్యార్థులను పలు సబ్జెక్టుల్లో ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. గణిత శాస్త్రం, రసాయనశాస్త్రం బోధించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు.మండలకేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రి, తహసీల్దార్ కార్యాలయాల్లోని రికార్డులను పరిశీలించారు. ఆమె వెంట ఎంపీడీవో విజయకుమారి, తహసీల్దార్ ప్రమీల, వైద్యాధికారి శంకర్‌నాయక్, వ్యవసాయదికారి పార్వతిచౌహన్, ఆర్ఐ సైదులు ఉన్నారు.



కస్తూర్బాగాంధీ పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న కలెక్టర్

మెట్ట పంటల సాగుపై దృష్టి సారించాలి

చిట్యాల: నీటి సౌలభ్యం లేనందున రైతులు నీరు తక్కువగా అవసరముండే మెట్ట పంటలు, కూరగాయల సాగుపై దృష్టి సారించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. చిట్యాలలో అధునాతన పద్దతుల్లో టమాట, పుచ్చకాయ సాగు చేస్తున్న కొంతం సత్తిరెడ్డి వ్యవసాయక్షేత్రాన్ని, అక్కడ ఉన్న ఫాంపాండ్‌ను పరిశీలించారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం

ఎమ్మెల్సీ, డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్

నల్లగొండ టౌన్,మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్సీ, డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ అన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణకు శాసనసభ ఆమోదం తెలపడాన్ని హర్షిస్తూ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో సంబురాలు నిర్వహించారు. రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంపు కార్యాలయం నుంచి క్లాక్ టవర్ సెంటర్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు. పెద్దఎత్తున బాణాసంచా కాల్చారు. ఈ సందర్భంగా శంకర్ నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. రాహుల్ గాంధీ ఆదేశానుసారం బీసీలకు రాష్ట్రంలో 42శాతం రిజర్వేషన్ అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. దేశంలో మొట్టమొదటిసారి ఎస్సీ వర్గీకరణకు శాసనసభలో ఆమోదం తెలిపిందన్నారు. గత ప్రభుత్వాలు బీసీల రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణపై మోసం చేశాయన్నా రు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బోడ స్వామి, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకుడు గండి చెరువు వెంకన్న గౌడ్, ప్రాంతీయ రవాణా శాఖ డైరెక్టర్ కూసుకుంట్ల రాజిరెడ్డి, కాంగ్రెస్ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు దుబ్బ అశోక్ సుందర్, కత్తుల కోటి, పోలె జయ కుమార్, యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గాలి నాగరాజు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

క్షీరాభిషేకం



కనగల్‌లో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న శంకర్‌నాయక్

8



హాలియాలో మంద కృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం తెలపడాన్ని హర్షిస్తూ అటు కాంగ్రెస్ నేతలు, ఇటు ఎమ్మార్పీఎస్ నేతలు జిల్లా వ్యాప్తంగా సంబురాలు జరుపుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంద కృష్ణ మాదిగల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:33 (గురువారం సాయంత్రం)

సహర్: 4:58 (శుక్రవారం ఉదయం)

పకడ్బందీగా 'పది' పరీక్షలు

- డీఈవో బొల్లారం భిక్షపతి



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

పదో తరగతి వార్షిక పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాలతో వివిధ శాఖల సమన్వయంతో పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. ఏప్రిల్ 4వరకు జరగనున్నాయి. పరీక్షలకు 105 రెగ్యులర్, 3 ప్రైవేట్ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో డీఈవో బొల్లారం భిక్షపతితో 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూ..

- (ఆంధ్రజ్యోతి, నల్లగొండ)

ఆంధ్రజ్యోతి: పదోతరగతి పరీక్షల ఏర్పాట్లు పూర్తి చేశారా?

డీఈవో: పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. మొత్తం విద్యార్థులు ఒకరోజు ముందుగానే పరీక్ష కేంద్రం అడ్రస్‌ను తెలుసుకొని ఉంటే పరీక్ష రోజు కేంద్రానికి హాజరు కావడానికి ఇబ్బంది ఉండదు.

ఆంధ్రజ్యోతి : ఎంత మంది విద్యార్థులు హాజరుకానున్నారు?

డీఈవో: జిల్లాలో 18,825మంది పరీక్షకు హాజరుకానున్నారు. ఇందులో 18,666 మంది రెగ్యులర్, 159 మంది విద్యార్థులు ప్రైవేట్‌గా పరీక్షలు రాయనున్నారు. ఇందులో బాలురు 9,669 మంది, బాలికలు 8,997మంది ఉన్నారు.

ఆంధ్రజ్యోతి: నిమిషం నిబంధన అమలులో ఉందా?

డీఈవో: ప్రభుత్వ ఆదేశాల మేరకు 5నిమిషాలు అదనంగా ఆలస్యమైనప్పటికీ పరీక్ష కేంద్రానికి అనుమతిస్తాం. నిమిషం నిబంధన అమలులో లేదు. ప్రతీ విద్యార్థి గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవడానికి ప్రయత్నించాలి.

ఆంధ్రజ్యోతి: పరీక్షల నిర్వహణకు ఎంత మందిని కేటాయించారు?

డీఈవో: ఒక్కో పరీక్ష కేంద్రంలో ఒక చీఫ్ సూపరింటెండెంట్‌తోపాటు డిపార్ట్‌మెంటల్ అధికారి చొప్పున మొత్తం 105 మంది సీఎస్‌లు, మరో 105 మంది డీవోలను నియమించాం. 986 మందిని ఇన్విజిలేటర్‌లుగా నియమించాం.

ఆంధ్రజ్యోతి: పరీక్ష కేంద్రంలో ఎలాంటి నిబంధనలు అమలు చేస్తున్నారు?

డీఈవో: పరీక్ష కేంద్రాల్లోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదు. సీఎస్, డీవో ఇన్విజిలేటర్లు కూడా సెల్‌ఫోన్‌లు, ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించబోం. ఈ నిబంధన ఫ్లయింగ్ స్క్వాడ్‌లకూ వర్తిస్తుంది.

ఆంధ్రజ్యోతి: మెరుగైన ఫలితాలకు ఎలాంటి ప్రణాళికలతో సాగారు?

డీఈవో: గతేడాది 96.70శాతంతో రాష్ట్రంలో 9వ స్థానంలో నిలిచాం. ఈ సారి మరింత మెరుగైన ఫలితాలను సాధించడం కోసం విద్యా సంవత్సరంలో 7 నెలలనుంచే ప్రత్యేక కార్యాచరణ రూపొందించాం.

ఆంధ్రజ్యోతి: పరీక్షలు రాసే విద్యార్థులకు ఎలాంటి సూచనలు ఇస్తున్నారు?

డీఈవో: విద్యార్థులు ఒత్తిడి, ఆందోళనకు గురి కాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలను రాయాలి. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు విద్యార్థులకు అండగా ఉండి వారిని ప్రోత్సహించాలి. ఈసారి జవాబులు రాసేందుకు బుక్‌లెట్‌ల విధానం అమలులోకి వస్తుంది. మొత్తం 24 పేజీలు ఉంటాయి. బయోసైన్స్, ఫిజికల్ సైన్స్ పరీక్షలకు 12 పేజీల బుక్‌లెట్‌ను ఇస్తారు.

మూసీ కాల్వలకు నీటి విడుదల

కేతేపల్లి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మూసీ ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు నాలుగో విడత సాగు నీటిని అధికారులు మంగళవారం రాత్రి విడుదల చేశారు.ఎండల తీవ్రత పెరగడంతో ఆయకట్టులో సాగు చేసిన పంటలు ఎండే పరిస్థితులు నెలకొనడంతో కుడి కాల్వకు 290.70క్యూసెక్కులు ఎడమ కాల్వకు 307.80క్యూసెక్కుల చొప్పున నీటిని వదిలారు. ఈ విడతలో రెండు కాల్వలకు పంటకాలం పూర్తయ్యే వరకు నీటి విడుదల కొనసాగనుంది. కాగా 645 అడుగులు(4.46టీఎంసీలు) పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం గల మూసీ రిజర్వాయర్ నీటిమట్టం ప్రస్తుతం 629.44అడుగులు(1.32టీఎంసీలు)గా ఉంది.

ఒంటిపూట బడులు మొదలయ్యాయి. వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు యువకులు, విద్యార్థులు, చిన్నారులు చెరువులు, వాగుల్లోకి వెళ్లి ఆడాలని అనుకుంటారు. వారిలో కొందరు ఈత సరదా తీర్చుకునేందుకు స్నేహితులతో కలిసి వెళ్తుంటారు. ఇలాంటి సమయాల్లో ప్రమాదం కొని తెచ్చుకుని నీటిలో మునిగి ప్రాణాలు పోగొట్టుకుంటున్న సంఘటనలు ఉన్నాయి. అలా వెళ్లి మృత్యువాతపడిన కుటుంబాల్లో నేటికీ ఆ జ్ఞాపకాల సుడులు తిరుగుతూనే ఉన్నాయి. వేసవి మొదలైన సందర్భంలో తల్లిదండ్రుల్లో అప్రమత్తతను కలిగించేందుకు ఈ కథనం...

ఆదమరిస్తే కన్నీరే



గూడూరు శివారులో ఇద్దరు యువకుల ప్రాణాలు బలిగొన్న చిన్నేటి వాగులోని నీటి కుంట

- ఆహ్లాదానికి నీటి వనరుల వద్దకు విద్యార్థులు, యువత
- చెరువులు, వాగుల్లో పొంచి ఉన్న గుంతలు
- కన్నీటి జ్ఞాపకాలను మిగుల్చుతున్న ఘటనలు
- ఈత సరదా కాకూడదు విషాదం

(ఆంధ్రజ్యోతి-బీబీనగర్)

హైదరాబాద్ -వరంగల్ జాతీయ రహదారిని ఆనుకుని 60 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న బీబీనగర్ చెరువు ప్రజలకు ఆదరవే కాదు. ఆదమరిస్తే ప్రాణాలు తీసేంత ప్రమాదకారి కూడా. రోడ్డు వెంట ప్రయాణించే వాహనాదారులు చెరువులో ఈత కొట్టేందుకు, స్నానం చేసేందుకు ఆసక్తి చూపుతారు. అయితే అలా చెరువులో సరదా కోసం ఈతకు వెళ్లిన ఎంతోమంది యువకులను తనలో ముంచేసుకుని ప్రాణాలు తీసిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. చెరువు లోతైన గోతులు, నీటితో నిండి ఉంది. ఎవరైనా తెలియక చెరువులోకి దిగితే ప్రాణాలు కబలించే ప్రమాదం లేకపోలేదు. అయినా ఇక్కడ ప్రమాద హెచ్చరికలు ఏర్పాటుచేయడంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. దాంతో గడిచిన పదేళ్లలో 18మందికి పైగా యువకులు నీటిలో మునిగి చనిపోయారు.

పెళ్లింట విషాదం..

హైదరాబాద్‌లోని ఓల్డ్ మలక్‌పేట ప్రాంతానికి చెందిన పాపగల్ల దశరథ కుమార్తె స్వాతిని అక్క కుమారుడు నర్సింగ్‌రావు(28)కు ఇచ్చి 2009 మార్చి 28న యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామి సన్నిధిలో వివాహం జరిపించారు. రోజంతా అక్కడే గడిపి మరుసటి రోజు రెండు కుటుంబాలు ట్రాలీ ఆటోలో మలక్‌పేటకు తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యలో బీబీనగర్ చెరువు వద్ద ఆటో టైరు పంక్చర్ కావడంతో టైరు మార్చేందుకు ఆపారు. ఆలోగా చెరువులోకి వెళ్లి స్నానం చేసి వద్దామని నవవరుడు నర్సింగ్‌రావు, అతడి బావ బుజన్ చెరువులోకి వెళ్లారు. వీళ్లు దిగిన చోట లోతైన గుంతలు ఉండటంతో మునిగిపోతూ పైకి చేతులెత్తి సైగ చేశారు. అదే సమయంలో అక్కడే స్నానం చేస్తున్న హైదరాబాద్ యూసుఫ్‌గూడ కృపానగర్‌కు చెందిన ఆవుల ప్రవీణ్‌కుమార్ వారిని కాపాడేందుకు దగ్గరకు వెళ్లగా నీటిలో మునిగిపోతున్న ఇద్దరు ప్రాణభయంతో ప్రవీణ్‌కుమార్‌ను గట్టిగా హత్తుకున్నారు. ఊపిరాడక ముగ్గురు నీటిలో మునిగి చనిపోయారు. అప్పటి వరకు పెళ్లి సంబరాలలో మునిగి తేలుతున్న ఆ కుటుంబాల్లో విషాదం నెలకొన్నది. నవవధువు స్వాతి పెళ్లి అయిన మరుసటి రోజే భర్తను కోల్పోయి కన్నీరుమున్నీరైంది. ఇద్దరు యువకుల ప్రాణాలను కాపాడబోయి మృతి చెందిన ప్రవీణ్ కుటుంబం, చేతికొచ్చిన కుమారుడిని కోల్పోయి పుత్రశోకం మిగిలింది.

ప్రాణాలు తీసిన ఈత సరదా..

భువనగిరి పట్టణంలోని ఆర్‌బీనగర్‌కు చెందిన మేడిగ భాస్కర్, మాధవి దంపతుల కుమారుడు సాయినిఖిల్(15), కిసాన్‌నగర్‌కు చెందిన సోమారపు నర్సింహ, సంధ్య దంపతుల కుమారుడు సాయికుమార్(15) స్థానిక ప్రెసిడెన్సీ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్నారు. 2016 అక్టోబరు 23న స్నేహితుడు రేపాల రంజిత్ పుట్టినరోజున ఆనందంగా గడిపేందుకు బీబీనగర్ మండలం గూడూరు గ్రామానికి చెందిన క్లాస్‌మెంట్ ఇంటికి 11మంది స్నేహితులతో వచ్చారు. ఊరు సమీపంలోని చిన్నేటి వాగు వద్ద వారు ఆహ్లాదంగా గడిపారు. అక్కడే వాగులో ఓ నీటి గుంతలో స్నానం చేసేందుకు సాయినిఖిల్, సాయికుమార్ వాగులో దిగారు. ఆ ప్రదేశం లోతు ఎక్కువగా ఉండడంతో ఇద్దరూ నీటి మునిగారు. తోటి విద్యార్థులు కాపాడే ప్రయత్నం చేసినా వారిలో ఏ ఒక్కరికీ ఈత రాక లోపలికి వెళ్లలేకపోయారు. దాంతో సాయికుమార్, సాయినిఖిల్ ఇద్దరు నీటమునిగి మృతి చెందారు. దీంతో రెండు కుటుంబాల్లో విషాదాన్ని మిగిల్చింది.

ఆదరువు కోల్పోయారు

(ఆంధ్రజ్యోతి-డిండి)

చేతికంది వస్తోన్న పిల్లలు. ఇంటితో పాటు భవిష్యత్‌కు భరోసాగా కనిపిస్తున్న వారు నీట మునిగి కన్నీటిని జ్ఞాపకాలుగా మిగిలిపోయారు. సరదా కోసం డిండి రిజర్వాయర్‌కు వెళ్లిన అన్నదమ్ముల పిల్లలు నలుగురూ మునిగి ఆయాకుటుంబాల్లో తీరని దుఃఖాన్ని మిగిల్చారు. నల్లగొండ జిల్లా డిండి మండలకేంద్రానికి చెందిన దౌపది కర్నాకర్‌రెడ్డి, అనిత దంపతులకు జోత్స్న, దేవమణి ఇద్దరు కుమార్తెలు. కాగా ఆయన సోదరుడు దౌపది దత్తారెడ్డికి హర్షవర్ధన్‌రెడ్డి, ప్రణీత్‌రెడ్డి ఇద్దరు కుమారులు. తమ తాత కర్మకాండకు వచ్చి ఈ నలుగురు పిల్లలు 30 జూలై 2014లో డిండి రిజర్వాయర్ బ్యాక్‌వాటర్‌లో మునిగిచనిపోయారు.మొదట జోత్స్న, దేవమణి నీటిలో ముందుకు వెళ్లి మునిగిపోతుండటంతో వారిని కాపాడే ప్రయత్నంలో ప్రణీత్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి నీటమునిగారు. ఈ ఘటన ఆయా కుటుంబాల్లో చెరగని జ్ఞాపకాలను మిగిల్చింది. ఉద్యోగాలు చేస్తున్న కుమారులు ప్రణీత్ రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి నీటమునిగి చనిపోవడంతో వారి తల్లిదండ్రులు మానసిక వేదనతో మృతి చెందారు. ప్రమాదం అనంతరం రిజర్వాయర్ వద్ద నీటిపారుదల శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. మట్టి తవ్వకాలను నిషేధించడంతో పాటు హెచ్చరిక బోర్డులతో పాటు ఎర్త్ డ్యాంపై ఇనుప జాలిని ఏర్పాటు చేశారు.

కదిలిస్తే కన్నీరే

చనిపోయిన పిల్లల తల్లిదండ్రులను పలకరిస్తే వారి కళ్లలో కన్నీటి సుడులు తిరిగాయి. ఆనాటి దుర్ఘటనను 'ఆంధ్రజ్యోతి'తో గుర్తుచేసుకుంటూ తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. ఇద్దరు కుమార్తెలు బాగా చదువుకొని కుమారుల్లేని లోటు తీరుస్తారని అనుకున్నాం. కానీ ఆ చెరువు మా పిల్లలను పొట్టన పెట్టుకుందని బాలికల తండ్రి కర్నాకర్‌రెడ్డి, అనితలు కన్నీటి పర్యంతమయ్యారు. టైలర్ వృత్తి చేస్తూ జీవనం సాగిస్తున్న కర్నాకర్‌రెడ్డికి ప్రభుత్వం ఆర్థిక తోడ్పాటును అందించలేదు.




జోత్స్న, దౌపది దేవమణి(ఫైల్‌ఫొటోలు)

ప్రవాహం.. ప్రమాదం



కాల్వలో స్నానం చేస్తున్న లారీ డ్రైవర్లు

(ఆంధ్రజ్యోతి-మునగాల): సూర్యాపేట జిల్లా మునగాల మండల కేంద్రంలో హైదరాబాద్-విజయవాడ రహదారిపై సాగర్ ఎడమకాల్వ హెడ్‌రెగ్యులేటర్ ఉంటుంది. కాల్వలో 25 అడుగుల లోతుతో నీరు ప్రవహిస్తుంటుంది. కాగా రహదారికి ఇరువైపుల కాల్వ ఉండి విశాల ప్రదేశం ఉండటంతో వాహనదారులు నిత్యం కాల్వలో స్నానం చేసేందుకు మక్కువ చూపుతున్నారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కాల్వలో పడి మృతి చెందుతున్నారు. స్థానికులకు కొంత అవగాహన ఉన్నా ఇతర రాష్ట్రాలకు చెందిన వారు ఇక్కడ స్నానం చేసేప్పుడు హెచ్చరిక సూచికలు లేకపోవడంతో ప్రమాదాల బారిన పడి మృతి చెందుతున్నారు. అయినా ఎన్నెస్పీ అధికారులు ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టలేదు. కనీసం రాత్రివేళలో ప్రమాదాన్ని గుర్తించేలా విద్యుత్ లైట్లు కూడా ఏర్పాటు చేయలేదు. ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని సామాజిక ఉద్యమకారులు ఆంజనేయశర్మ, వెంకటేశ్వర్లు కోరారు.

- 2021 అక్టోబరు 8న హైదరాబాద్ మొయిన్‌పల్లికి చెందిన డీసీఎం డ్రైవర్ మారువడి జగదీష్ భార్యాపిల్లలతో వాహనంలో వచ్చి కాల్వ ఒడ్డున స్నానం చేస్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కాల్వలో పడి కుటుంబసభ్యుల కళ్లెదుటే నీటమునిగి మృతి చెందాడు. 2022 జనవరి 30న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణాజిల్లా నందిగామ మండలం అనాసాగరం గ్రామానికి చెందిన తాటి సుధీర్‌కుమార్(15),స్నానం చేసిన క్రమంలో కాల్వ పడి మృతి చెందాడు.



దామెరలో బడి నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

ఒంటిపూట జర భద్రం

(ఆంధ్రజ్యోతి-నాంపల్లి): ఒంటిపూట బడులతో దొరికిన సమయాన్ని బావిలోనో, చెరువులోనో ఈతకొట్టి సరదాగా గడుపుదాం అనుకునే విద్యార్థులను, యువతను కుటుంబ సభ్యులు ఓ కంట కనిపెట్టుకుని ఉండాలి. ఈ నెల 15 నుంచి పాఠశాలకు ఒంటి పూట బడి మొదలుపెట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో అధిక సంఖ్యలో విద్యార్థుల తల్లిదండ్రులు వ్యవసాయం, కూలీ పనుల మీదనే ఆధారపడి ఉంటారు. విద్యార్థులు పాఠశాల నుంచి వచ్చే సరికి కుటుంబ సభ్యులు లేకపోవడంతో ఎండల్లో ఆడుతూ సరదాగా గడపడానికి మక్కువ చూపుతారు. యువకులు ఈత వచ్చినా రాకున్నా చెరువులు, వాగుల వద్దకు వెళ్తున్నారు. అలా వెళ్లి ప్రమాదాల బారినపడే అవకాశం ఉంది. దీంతో వారిని ఓ కంట కనిపెట్టాలి.

ఇంటి వద్ద ఆటలపై మక్కువ పెంచాలి

వేసవిలో పిల్లలకు సంప్రదాయ ఆటలతో పాటు ప్రస్తుతం ఆటలను నేర్పించాలి. ఇండోర్ ఆటలైన చెస్, క్యారమ్స్, వాలీబాల్, టెన్నీకాయిట్ ఆటలతో పాటు సంప్రదాయ ఆటలైన అష్టాచెమ్మా, పచ్చీస్, వనగుంతలు, పులిమేక ఆటలతోపాటు పిల్లల ఆసక్తిని కనిపెట్టి బొమ్మలు వేయడం తదితర విషయాలు నేర్పించాలి. ఇంటి వద్ద సరదాగా ఉండే ఆటలు ఆడుకునేలా ఉండే ఆటలను ప్రోత్సహించాలి. అలా ప్రోత్సహిస్తే స్నేహితులతో కలిసిమెలిసి ఉండటంతో పాటు ఇంటి పట్టునే జాగ్రత్తగా ఉంటారు. అదే విధంగా ఇంట్లో ఆడుకునే ఆటవస్తువులను వారికి అందుబాటులో ఉంచడం చాలా ముఖ్యం.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

నీటి వనరులైన చెరువులు, వాగుల వద్దకు వెళ్లే పిల్లలతో పాటు పెద్దలూ వెళ్లాలి. ముందుగానే ప్రమాదం జరిగే చోటును పరిచయస్తులను అడిగి తెలుసుకోవాలి. చెరువుల్లో మట్టితోడిన గోతులు ఉన్నాయా లేవా అని నిర్ధారించుకొని నీటిలోకి దిగాలి. చేపలవేట కోసం వలలు నీటిలో వేశారా లేదా అనేది గుర్తించాలి. ఈత రానివారు జారుడుగా ఉన్న ప్రాంతాల్లోని నీటిలోకి దిగకపోవడం మంచిది.

పిల్లల ఎక్కడికి వెళ్లినా జాగ్రత్తలు తీసుకోవాలి



పాఠశాల నుంచి ఇంటికి రాగానే విద్యార్థులు బయటికి వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. పాఠశాలల్లో ఉపాధ్యాయుల జాగ్రత్తలు చెప్పినా కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ఇద్దరు లేక నలుగురు విద్యార్థులు కలిసి ఆడుకునే ఆటలు క్యారమ్ బోర్డ్, చెస్ మొదలైన అట వస్తువులను వారికి అందుబాటులో ఉంచడం వల్ల ఇంట్లోనే స్నేహితులతో కలిసి ఆడుకునే అవకాశం ఉంటుంది.

- అజయ్, ప్రధానోపాధ్యాయుడు, జడ్పీహెచ్ఎస్, నాంపల్లి

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

మిర్యాలగూడ అర్బన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నల్లగొండజిల్లా మిర్యాలగూడ పట్టణంలో కుటుంబకలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. టూటౌన్ సీఐ నాగార్జున తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని భాగ్యనగర్‌కాలనీకి చెందిన ముడావత్ నాగునాయక్(35)కు భార్య ప్రియతో గొడవలు జరుగుతున్నాయి. దీంతో మానసికంగా కుంగిపోయిన నాగు తన బెడ్‌రూంలో ఉరివేసుకున్నాడు. బయటకు వెళ్లిన భార్య ప్రియ ఇంటికి తిరిగి వచ్చేసరికి ఉరివేసుకుని కనిపించడంతో బోరునవిలపించింది. పక్కింటివారి సహాయంతో ఇంటి తలుపులు పగులగొట్టి అంబులెన్స్‌లో చికిత్సకోసం పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా తన కుమారుడి మృతికి కోడలు ప్రియ, ఆమె అక్క, బావ సైదా, విజయలు కారణమని నాగునాయక్ తండ్రి పంతులునాయక్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ నాగార్జున తెలిపారు.

విద్యుదాఘాతంతో వేర్వేరు చోట్ల ఇద్దరు మృతి



సైదులు(ఫైల్‌ఫొటో)

గరిడేపల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో వ్యవసాయ కూలీ మృతి చెందాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా గరిడేపల్లి బుధవారం జరిగింది. ఎస్ఐ చలికంటి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పొనుగోడు గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ నేలపట్ల సైదులు(30) గ్రామానికి చెందిన రైతు వ్యవసాయ పొలం దగ్గరకు పనులకు వెళ్లాడు. పొలంలో ఉన్న విద్యుత్ లేన్ ఎల్‌టీ వైరు తెగి పడటంతో గమనించని సైదులు పొలం ఒరంపై నడుచుకుంటూ వెళ్తూ వైర్‌ను తాకడంతో విద్యుదాఘాతానికి గురై సైదులు అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. సైదులు తమ్ముడు గురుమూర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు. సైదులు కొంతకాలం కిందట భార్యతో విడాకులు తీసుకుని ఒంటరిగా ఉంటున్నాడు.

క్రికెట్ ఆడేందుకు గోడ దూకుతూ...

మిర్యాలగూడ అర్బన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని జంకుతండా పరిధిలోని పరిశ్రమవాడలో బుధవారం జరిగింది. రూరల్ ఎస్ఐ లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం ఇండస్ట్రీయల్ ఏరియాకు చెందిన చింతపల్లి పవన్‌కల్యాణ్(19) అనే యువకుడు తన స్నేహితుడు పూజ దుర్గతో కలిసి క్రికెట్ ఆడేందుకు ఆర్ఎస్ గోడౌన్స్ గ్రౌండ్‌లోకి గోడదూకి వెళ్లేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో గోడపక్కన ఉన్న చెట్టును పట్టుకొని గోడదూకే ప్రయత్నంలో 33కేవీ హైటెన్షన్ విద్యుత్‌తీగకు చెట్టుకొమ్మలు తాకి షార్ట్‌సర్క్యూట్ జరిగింది. దీంతో పవన్‌కల్యాణ్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందగా మరో యువకుడు దుర్గ తీవ్రంగా గాయపడ్డాడు. పవన్‌కల్యాణ్ మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. గాయపడ్డ దుర్గ పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన వైద్యం కోసం నల్లగొండ జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. పవన్‌కల్యాణ్ తండ్రి కృష్ణ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మయ్య తెలిపారు.

వేర్వేరుచోట్ల ఎనిమిది మంది జూదరుల అరెస్ట్

మునగాల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మునగాల మండలంలో నలుగురు జూదరులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. బరాఖత్‌గూడెంలో నూకమళ్ల ముత్తయ్య ఇంటి ఆవరణలో నలుగురు పేకాడుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసినట్లు తెలిపారు. ముగ్గురు పరారీ కాగా షేక్ లాలు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించినట్లు తెలిపారు. షేక్‌లాలు తో పాటు పరారైన మక్కుర అంకారావు, నూకమల్ల సుందరయ్య, కొమ్ము వీరబాబులపై కేసు నమోదు చేశామన్నారు. రెండు బైక్‌లు. రూ.4వేల నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.

త్రిపురారంలో

త్రిపురారం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా త్రిపురారం మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో పేకాటఆడుతున్న నలుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. బైరం దశరథ, బోనగిరి రమేష్, ఉల్లెందుల ఆనంద్, ఉప్పు రాజేశ్ అనే వ్యక్తులపై కేసు నమోదు చేసి వారి వద్ద నుంచి రూ.13,200 నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

అంతా అతడి కనుసన్నల్లోనే...

- డిండి తహసీల్దార్ కార్యాలయంలో ఓ ఉద్యోగిదే పెత్తనం
- ప్రతి పనికో రేటు ● అతడి నుంచి ఫైల్ వెళితేనే మోక్షం



డిండి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా డిండి కార్యాలయంలో అవినీతి, అక్రమాలకు ఓ ఉద్యోగి కేంద్ర బిందువుగా మారాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆ ఉద్యోగి అన్నీతానై కార్యాలయంలో చక్రం తిప్పుతూ తన గుప్పిట్లోకి తీసుకున్నట్లు ఆరోపిస్తున్నారు. ఇతడి వల్లే ప్రజలకు పారదర్శకంగా అందాల్సిన సేవలు ముడుపులిస్తేనే కాని పరిస్థితి చేరాయి. ప్రధాన ఉద్యోగిని పక్కనపెట్టి తన హోదాకు మించి ఆ ఉద్యోగి కార్యాలయాన్ని శాసిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఇతడి ద్వారా వెళితే తప్ప పనులు కావనే స్థాయికి చేరింది. ధరణిలో తలెత్తిన భూసమస్యలు ఈ ఉద్యోగికి వరంగా మారాయి. మిస్సింగ్ నెంబర్లు, భూముల విస్తీర్ణం తక్కువగా నమోదుకావడం, ఫొటోల తారుమారు, పట్టాభూములు ప్రభుత్వ భూములుగా నమోదు కావడం, ఒకరి భూసర్వేనెంబర్‌లో మరొకరిపై నమోదుకావడం వంటి సమస్యలు ఈ ఉద్యోగికి కాసులు కురిపిస్తున్నాయి. ప్రతీ సమస్య పరిష్కారానికి ఓ ధర నిర్ణయించి భారీగా నగదు దండుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మిస్సింగ్ నెంబర్లకు రూ.50వేలు మొదలుకొని ఆపైన రూ.లక్షల్లో వసూలు చేసినట్లు సమాచారం. కోర్టుల్లో భూవివాదాల కేసులు నడుస్తున్నప్పటికీ అదనంగా వసూళ్లు చేస్తూ పాస్‌పుస్తకాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. మండలంలోని ఓ గ్రామంలో నెలకొన్న సమస్యను పరిష్కరించేందుకు కొందరి వ్యక్తుల నుంచి హైదరాబాద్‌లోని ఓహోటల్‌లో డీల్ కుదుర్చుకొని ఇటీవల రూ.8లక్షల నగదు తీసుకున్నట్లు సమాచారం. ఉన్నతాధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చేందుకే ఈ డీల్ కుదుర్చుకున్నారని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇప్పటికే ఈ అవినీతి అధికారిపై ఏసీబీ అధికారుల నజర్ పడినట్లు సమాచారం. లావాదేవీలు హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో ఈ ఉద్యోగి కుదుర్చుకుంటున్నట్లు చర్చ నడుస్తోంది. అయితే ఇతడిపై ఎన్ని ఆరోపణలు వస్తున్నా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఇదిలా ఉండగా భూముల వివరాలకు ప్రధాన ఆధారమైన 1956 నాటి డిండి కాస్రాను కార్యాలయంలో మిస్సయినట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో వివరాల ఆనవాళ్లను చెరిపే ప్రయత్నం జరుగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెవెన్యూశాఖలో పనిచేస్తూ మృతి చెందినవారి కుటుంబ సభ్యులలో ఒకరికి(కారుణ్య నియామకం) ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ సదరు ఉద్యోగి మృతుడి కుటుంబాల సన్నిహితుల నుంచి రూ.50వేల నగదు ఫోన్‌పే ద్వారా రెండు విడతల్లో తన ఖాతాలో జమచేసుకున్నాడు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన రైతు భూసమస్య కోసం రూ.20వేలు ఆ గ్రామానికి చెందిన మధ్యవర్తి ద్వారా తన ఖాతాలో జమ చేసుకున్నాడు. ఇలా కార్యాలయాన్ని అవినీతి మయంచేశాడు. దీనిపై తహసీల్దార్ అంబటి ఆంజనేయులును వివరణ కోరగా కార్యాలయంలో పని చేసే ఉద్యోగులు ఎవరైనా అవినీతికి పాల్పడినట్లు ఫిర్యాదులు అందితే సదరు ఉద్యోగిపై పోలీసుకేసులు నమోదు చేయించి బాధితులకు తిరిగి డబ్బులు ఇప్పిస్తామన్నారు.

ఒకదాని వెనుక మరొకటి ఢీకొన్న వాహనాలు

చిట్యాల రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి):నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై రెండు వాహనాలు ఢీకొని ఒకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన పెద్దకాపర్తి వద్ద మంగళవారం రాత్రి జరిగింది. వాహనదారులు తెలిపిన వివరాల ప్రకారం పెద్దకాపర్తి వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు జరుగుతుండగా జాతీయ రహదారి మీదుగా వచ్చే వాహనాలను సర్వీస్ రోడ్డు ద్వారా ప్రస్తుతమున్న బ్రిడ్జి మీదుగా మళ్లించారు. దీంతో రాత్రి సమయంలో వాహనాలు సర్వీస్ రోడ్డు మీది నుంచి హైవే బ్రిడ్జి పైకి మళ్లే సమయంలో ఒక్కసారిగా వేగాన్ని తగ్గించి నిదానంగా వెళ్తున్నాయి. ఈ క్రయంలో మంగళవారం రాత్రి హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్లే వాహనాలో ముందున్న వాహనం ఒక్కసారిగా వేగం తగ్గడంతో వెనుక వచ్చే వాహనాలు ఒకదాని వెంట మరొకటి ఢీకొన్నాయి. లారీ, ట్రాలీ, ప్రైవేటు ట్రావెల్స్ బస్సు, ఆర్టీసీ బస్సు ఒకదాని వెనుక మరొకటి ఢీకొన్నాయి. ఈఘటనలో ఇద్దరికి గాయాలు కాగా చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లి కామినేని ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదంపై చిట్యాల ఎస్ఐ ధర్మని సంప్రదించగా ఒకరికి గాయాలైనట్లు తెలిసిందని, తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

జామాయిల్ తోటలో అగ్నిప్రమాదం

రూ.10 లక్షల ఆస్తినష్టం

రాజాపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలం బొందుగులలో అగ్నిప్రమాదం జరిగి రూ.10 లక్షల ఆస్తినష్టం వాటిల్లింది. వివరాలు ఇలా ఉన్నాయి. రాజాపేట మండలం బొందుగుల గ్రామానికి చెందిన బొందుగుల వెంకటేశ్వర్‌రెడ్డి 40 ఎకరాల్లో జామాయిల్ తోటను సాగు చేశారు. బుధవారం తోటలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ జంపర్ తెగిపడడంతో మంటలు చెలరేగి తోటకు అంటుకున్నాయి. దీంతో తోట మొత్తానికి మంటలు వ్యాపించడంతో యాదగిరిగుట్ట ఫైర్‌సర్వీస్‌కు బాధితులు సమాచారం అందజేశారు. యాదగిరిగుట్ట, ఆలేరు పట్టణాల నుంచి ఫైర్ ఇంజన్లతో సిబ్బంది మంటలను ఆర్పారు. సుమారు 21 ఎకరాల వరకు కాలిపోయింది. దీంతో రూ.10 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు.

యువతిపై లైంగిక దాడి : ముగ్గురిపై కేసు

- మరోసారి సహకరించాలంటూ వేధింపులు

హుజూర్‌నగర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తనతో సన్నిహితంగా ఉన్న ఫొటోలు చూపించి మరో యువకుడికి లైంగికంగా సహకరించాలని బెదిరిస్తున్న ముగ్గురిపై సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో కేసు నమోదైంది. ఈ ఘటనకు సంబంధించి లైంగికదాడి, బ్లాక్‌మెయిల్ కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ముత్తయ్య తెలిపారు. ఎస్ఐ తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. హుజూర్‌నగర్‌కు చెందిన నూకతొట్టి ప్రమోద్‌కుమార్‌కు స్థానికంగా ఉన్న ఓ యువతితో స్నేహం ఉంది. ఆమె స్నేహితురాలి(26)తో ప్రమోద్‌కుమార్‌కు పరిచయం ఏర్పడింది. ఈ నెల 7వ తేదీన మధ్యాహ్నం ఆ యువతిని నీతో మాట్లాడాలని స్థానిక లాడ్జికి తీసుకెళ్లాడు. అక్కడ మద్యం తాగించి, ఆమె మత్తులోకి జారుకోగానే లైంగికదాడి చేశాడు. అదే సమయంలో ఆమె న్యూడ్ ఫొటోలు తీసుకుని దాచుకున్నాడు. ఈ నెల 18న మధ్యాహ్నం ప్రమోద్‌కుమార్, స్నేహితురాలితో పాటు అతడి సమీప బంధువు పట్టణంలోని తిలక్‌నగర్‌కు చెందిన ఎల్.హరీష్‌లు కలిసి బాధిత యువతిని కారులో ఎక్కించుకుని కోదాడ రోడ్డులోని రిజిస్ట్రేషన్ కార్యాలయం వైపు తీసుకెళ్లారు. అక్కడ ప్రమోద్‌కుమార్‌తో పాటు హరీష్‌తో ఒకేసారి శారీరకంగా కలవాలని ముగ్గురు ఆ యువతిపై ఒత్తిడి తెచ్చారు. లేకపోతే రహస్య ఫొటోలు బయటపెడతామని బెదిరించారు. అందుకు ఆ యువతి ఒప్పుకోకపోవడంతో ఆమెను తీవ్రంగా గాయపరిచారు. అదే సమయంలో అక్కడినుంచి పారిపోతుండగా స్థానికులు గమనించారు. దీంతో ప్రమోద్, హరీష్, యువతి స్వామి రోజా అక్కడి పరారయ్యారు. అనంతరం ఆ యువతి పారిపోయి ఇంటికి చేరుకుని కుటుంబసభ్యులకు విషయం తెలిపింది. బుధవారం బాధిత యువతి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ ముత్తయ్య తెలిపారు. ఈ మేరకు ప్రమోద్, హరీష్, యువతి స్వామి రోజాలపై అత్యాచారం, బ్లాక్‌మెయిల్‌తో పాటు ఇతర సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇదిలా ఉండగా ఈ కేసులో నిందితులైన యువకులు ఓ రాజకీయ పార్టీకి చెందిన వారు. ప్రధాన నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. మరొక నిందితుడి తండ్రి ఓ రాజకీయ పార్టీకి చెందినవారు కావడంతో యథేచ్ఛగా తిరుగుతున్నాడు.

మంత్రి కోమటిరెడ్డి సోదరుడి వాట్సాప్ హ్యాక్

నార్కట్‌పల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సోదరుడు నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని గోపలాయపల్లి వారిజాల వేణుగోపాలస్వామి దేవస్థానం అనువంశిక ధర్మకర్త కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి వాట్సాప్ అకౌంట్‌ను సైబర్ నేరగాళ్లు హ్యాక్‌చేశారు. మోహన్‌రెడ్డి వాట్సాప్ నెంబరు నుంచి పలువురికి డబ్బులు పంపమని హాకర్లు సందేశాలు పంపారు. రూ.45 వేలు అర్జెంట్‌గా కావాలని మళ్లీ వెంటనే పంపిస్తానంటూ సందేశం పంపారు. ఈ మెసెజ్‌లు చేసిన పలువురు ఆయన్ను అప్రమత్తమయ్యారు. తన నెంబరు పేరిట ఎవరైనా డబ్బులు కావాలని మెసేజ్ పెడితే స్పందించవద్దని మోహన్‌రెడ్డి చెప్పారు.

15 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

నేరేడుచర్ల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న 15 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల ఎస్ఐ రవీందర్ తెలిపారు. బక్కయ్యగూడెం గ్రామంలో 32టిక్కీల రేషన్ బియ్యాన్ని ట్రాలీ వాహనంలో ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రం దాచేపల్లికి తరలిస్తున్నారనే సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఇందుకు సంబంధించి పిండిప్రోలు పర్వతాలు, పాలకుర్తి రమణను అదుపులోకి తీసుకోగా మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు తెలిపారు.నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చోరీకి పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు

మిర్యాలగూడ అర్బన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మూతబడ్డ తవుడు మిల్లులో చోరీకి పాల్పడుతున్న వ్యక్తిని నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రూరల్ పోలీసులు బుధవారం అరెస్టుచేశారు. ఎస్ఐ లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని టీక్యాతండా శివారులో కెస్ట్రాల్ తవుడు మమిల్లు స్టోర్‌రూం తాళాలు విరగొట్టి అందులో నిల్వఉన్న అల్యూమినియం షీట్లు, చైర్లు, టెబుల్స్ ఈ నెల 17వతేదీ రాత్రి చోరీకి గురయ్యాయి. మిల్లు యాజమాన్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న క్రమంలో టీక్యాతండాకు చెందిన ధీరావత్ నిఖిల్ అనే వ్యక్తి అనుమానస్పదంగా సంచరిస్తుండగా బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. పోలీసుల విచారణలో నిఖిల్ నేరం అంగీకరించగా అతడి నుంచి దొంగిలించిన వస్తువులను రికవరీ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ లక్ష్మయ్య తెలిపారు.


అన్ని వర్గాలను మోసం చేశారు



: రాష్ట్ర బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలను మోస గిం చింది. కాంగ్రెస్ ప్రభు త్వం అంచ నాలకు సంబంధం లేకుండా అరచేతిలో వైకుంఠం చూపిస్తోంది. కాంగ్రెస్ మ్యానిఫెస్టోపై పెట్టుకున్న ఆశలు మళ్లీ అడియాసలు అయ్యాయి. రూ. 31వేల కోట్లతో రుణమాఫీ చేస్తానని చెప్పి రూ. 20వేల కోట్లతో రుణమాఫీ చేశామని బడ్జెట్‌లో చెప్పారు. గతేడాది రెవెన్యూ మిగులు 5,888 కోట్లు ఉందని ఈ ఏడాది రూ. 2,738 కోట్లు ఉందని చెబుతున్నారు. ప్రతి ఏడాది రెవెన్యూ మిగులు ఉంటే రాష్ట్రం దివాళా తీసిందని ఎట్లా చెబుతారు.

మాజీ మంత్రి గుంటకండ్ల జగదీ‌ష్‌రెడ్డి

సాగునీటికి ప్రాధాన్యం



బడ్జెట్‌లో జిల్లాలోని సాగు, తాగునీరు ప్రాధాన్యం కల్పించింది. జిల్లాలోని కరువు ప్రాంతాల్లో సాగునీటి కాల్వల పనులు చేపట్టేందుకు ప్రత్యేకంగా నిధులు కేటాయించింది. మూసీ కాలువల పునరుద్ధరణకు రూ.266 కోట్లు కేటాయించింది. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ కాల్వల పునరుద్ధరణకు నోచుకోవడంతో రెండు జిల్లాల రైతులకు ప్రయోజనం చేకూరనుంది. మూసీ ప్రక్షాళనతో ఈ ప్రాంత ప్రజలకు కాలుష్యం నుంచి విముక్తి లభిస్తుంది.ప్రజలకుఉపయోగపడేలా బడ్జెట్ ఉంది

-కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే

బడ్జెట్ పూర్తిగా అంకెల గారడీ



బడ్జెట్ అంకెల గారడీ తప్ప పేదల ఆశలు తీర్చే దిగా, కాంగ్రెస్ ఎన్ని కల హామీలు నెర వేర్చేదిగా లేదు. రూ.3,04,960 కోట్లతో రూపొందించిన బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి రూ.24,439 కోట్లే కేటాయించారు. గతేడాది రూ.49 వేల కోట్లు కేటాయించగా ఈ సారి తగ్గించారు. గతంలో రైతు భరోసాకు రూ.18 వేల కోట్లు కేటాయించామని చెప్పిన ప్రభుత్వం కొద్ది మంది రైతులకు రూ. 3,400 కోట్లు మాత్రమే ఇచ్చి మిగతా రైతు లను మోస గించింది

కంచర్ల రామకృష్ణారెడ్డి, బీఆర్ఎస్,యాదాద్రి జిల్లా అధ్యక్షుడు

అన్ని వర్గాలకు ఉపయోగం



రాష్ట్ర బడ్జెట్ అన్ని రంగాల ప్రజలు సంతృప్తి చెందే విధంగా ఉంది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం కోసం ప్రవేశ పెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలకు ఉపయోగపడుతుంది. బడ్జెట్‌లో ప్రధానంగా వ్యవసాయ రంగానికి పెద్దపీట వేయడం ద్వారా ఆ రంగాన్ని మరింత బలోపేతం చేయడం జరుగుతుంది. అలాగే నీటిపారుదల శాఖకు అధిక నిధులు కేటాయించినందున జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు త్వరగా పూర్తి చేయాలి.

-నెల్లికంటి సత్యం, ఎమ్మెల్సీ

పేరుగొప్ప...ఊరుదిబ్బ బడ్జెట్



రాష్ట్ర బడ్జెట్‌లో ఎలాంటి ప్రాజెక్టు గాని, ఇన్‌ఫ్రాస్టక్చర్ వ్యయం లేదు. బడ్జెట్‌లో సింహభాగం వడ్డీ చెల్లింపులకు పోగా ప్రస్తుత బడ్జెట్ లో సుమారు రూ. 70 వేల కోట్లు లోటును మళ్లీ అప్పుల ద్వారా, రూ. 24వేల కోట్లు హైదరాబాద్‌లో విలువైన స్థలాలను విక్రయం ద్వారా సమకూర్చుకోనున్నట్లు చెప్పారు. ఎన్నికల సమయంలో ఆరుగ్యారెంటీల అమలుకు ప్రత్యేక నిధులు ప్రస్థావన లేదు.

పెద్దరెడ్డి గణేష్, బ్యాంకింగ్ రంగ నిపుణులు, సూర్యాపేట

నేతన్నకు మొండి చెయ్యి



మోత్కూరు : కేంద్ర ప్రభుత్వం చేనేతకు రూ.200 కోట్లు కేటా యించగా రాష్ట్ర ప్రభుత్వం రూ. 371 కోట్లు కేటా యిం చింది. చేనేత, పవర్ లూమ్ పరికరాలు 90 శాతం సబ్సిడీపై అందిస్తామని, చేనేత ఉత్పత్తులను ఈ కామర్స్‌లతో అనుసంధానం చేస్తామని హామీ ఇచ్చింది. ఈ నిధులు ఎలా సరిపోతాయి

కూరపాటి రమేష్, పవర్ లూమ్ వర్కర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

పూత నిలవదు..పిందె కనిపించదు

మామిడి సాగు ఐదు, ఆరేళ్లుగా ఆశాజనకంగా కనిపించడం లేదు. ఈ ఏడు కూడా నష్టాల బారిన పడే అవకాశాలే మెండుగా కనిపిస్తున్నాయి. ఏళ్ల తరబడి శ్రమ కూర్చి పంటలను సాగు చేస్తున్నా వాతావరణంలో విభిన్న పరిస్థితులు ఎదురవ్వడంతో మామిడి తోటలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. అయితే మామిడికి అనుకూలమైన వాతావరణ పరిస్థితి లేకపోవడంతో పూత పూసే సమయంలో ఈగుర్లు, కాచే సమయంలో పూత వస్తుంది.

(ఆంధ్రజ్యోతి-రాజాపేట)

- మామిడి రైతులకు తెగుళ్ల కష్టాలు
- అనుకూలించని వాతావరణం
- తగ్గుతున్న దిగుబడి
- ఆందోళనలో రైతులు

రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు ఉద్యాన పంటలపై దృష్టిని సారించారు. అందులో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో రైతులు మామిడి సాగు చేపట్టారు. దశేరి హిమాయత్ బంగినపల్లి, పునాస, చిన్నరసాలు, పెద్దరసాలు తదితర రకాలను సాగు చేశారు. జిల్లాలో 3,613 మంది రైతులు 11,333 వేల ఎకరాల్లో మామిడి సాగు చేశారు. బోర్లు, బావులు కింద అధికంగా సేద్యం జరుగుతుంది. నవంబరు, డిసెంబరు వరకే పూత వచ్చి జనవరి చివరి కల్లా చిన్న పాటి పిందెలు ఏర్పడి మార్చి మొదటి వారం వరకు పావుకిలో సైజుకు పెరగాల్సి ఉంది. కానీ వాతావరణ ప్రభావంతో మార్చిలో సైతం మంచు కురుస్తుండడంతో పూత ఖాతా నిలవడం లేదు. మామిడి చెట్టుకు పిందెలు అంతంతమాత్రంగానే కనిపిస్తున్నాయి. వాతావరణ ప్రభావంతో వివిధ తెగుళ్ల సోకుతున్నాయి. పూత పిందెను రక్షించేందుకు రైతులు విచ్చలవిడిగా మందులను స్ప్రే చేస్తున్నారు. ఇప్పటివరకు 5 నుంచి 6 సార్లు స్ప్రే చేసి రూ. వేలు వెచ్చిస్తున్నారు. అయినా మెరుగైన ప్రభావం కనిపించడం లేదు.

గత పదేళ్లుగా

గత పదేళ్లుగా మామిడి సాగు చేసే రైతులకు కాలం కలసిరావడం లేదు. వడగండ్లు, ఈదురుగాలులు, వాతావరణం అనుకూలించక తగ్గిన దిగుబడి, పండిన పంటకు రేటు లేకపోవడంతో ఏటా రైతులు నష్టాలపాలవుతున్నారు. ప్రధానంగా కరోనా నుంచి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పెట్టుబడి వ్యయం పెరుగుతున్నప్పటికీ పంట దిగుబడి రావడం లేదు. నష్టాలు తప్ప లాభాలు రావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి రైతులకు ఎలాంటి నష్టపరిహారం అందడం లేదు. వడగండ్లకు పంటరాలిపోయిన అధికారులు సర్వే నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదికలు పంపిన ఇప్పటివరకు రూపాయి సాయం అందలేదని మామిడి రైతులు వాపోతున్నారు.



రాజాపేట మండలం బొందుగులలో మామిడి తోట

తోటలు కాపాడుకునేందుకు నానాపాట్లు

మామిడి తోటలపై వాతావరణం ప్రభావం చూపుతుండగా మరోవైపు అడుగంటుతున్న భూగర్భ జలాలు తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. రైతులు తోటలను కాపాడుకునేందుకు నానాతంటాలు పడుతున్నారు. బోర్లు, బావులు నీరు అడుగంటడడంతో, ఎండలు తీవ్రమవుతుండడంతో మామిడి పూత, పిందె రాలిపోతున్నది. తోటలు ఎండిపోవడంతో తోటలను కాపాడుకునేందుకు రైతులు లక్షల రూపాయలు వెచ్చించి విచ్చలవిడిగా బోర్లను తవ్విస్తున్నారు. అయినప్పటికీ నీరు రాకపోవడంతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

కౌలుకు తీసుకున్న.. దిగుబడి కష్టమే



పది ఎకరాలు మామిడి తోట కౌలుకు తీసుకున్నా. పూత, కాత సరిగ్గాలేదు. మంచు కురుస్తుండడంతో తోటలకు వివిధ తెగుళ్ల వస్తున్నాయి. రోగాల నుంచి రక్షించుకునేందుకు వేల రూపాయలు ఖర్చు పెట్టి మందులను స్ప్రే చేయాల్సి వస్తుంది. దిగుబడి కష్టంగానే మారింది.

- శక్తి వీరేశం కౌలు రైతు, బొందుగుల

మామిడి దిగుబడి అంతంతే



15 ఎకరాల్లో మామిడి సాగు చేశా. లక్ష రూపాయలు వెచ్చించా. ఐదారేళ్లుగా వాతావరణం అనుకూలించక పోవడంతో పంట దిగుబడి రావడం లేదు. వేసవిలో బావులు, బోర్లు ఎండిపోవడంతో తోటలను కాపాడుకోవడం కష్టంగా మారింది. ప్రభుత్వం స్పందించి మమల్ని ఆదుకోవాలి. వడగండ్లకు సంబంధించి నష్టపరిహారం చెల్లించాలి

-వంచా వీరారెడ్డి, మామిడి రైతు, చల్లూరు

ప్రభుత్వ సాయం అందించాలి



మామిడితోట సాగు చేసే రైతులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఏటా వివిధ రకాలుగా నష్టాల పాలవుతున్నాం. ప్రభుత్వానికి మొర పెట్టుకున్న రూపాయి సాయం అందడం లేదు. మామిడితోటలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

- గుంటి మధుసూదన్‌రెడ్డి, రైతు, జాల

పంటలు ఎండుతున్నా పట్టించుకోని ప్రభుత్వం

కొండమల్లేపల్లిలో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీ‌ష్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీ‌ష్‌రెడ్డి

కొండమల్లేపల్లి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పంటలు ఎండిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని మాజీ మంత్రి గుంటకండ్ల జగదీ‌ష్‌రెడ్డి విమర్శించారు. నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి పాలశీతలీకరణ కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ సరఫరాలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చి 16 నెలలు గడుస్తున్నా ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఒక్క పిల్లర్ కూలితే దాన్ని మరమ్మతులు చేయించి రైతులకు నీరు ఇవ్వాల్సింది పోయి కేసీఆర్‌కు ఎక్కడ పేరు వస్తుందోనని దుర్బుద్ధితో సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు నీటి సరఫరా చేయకుండా పొలాలు ఎండబెడుతున్నారని విమర్శించారు.

వాటాకు మించి కృష్ణా నీరు తరలింపు

ఏపీ సీఎం చంద్రబాబునాయుడు కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డుపై పెత్తనం చెలాయిస్తూ వాటాకు మించి నీళ్లను ఆంధ్రకు తీసుకెళ్తున్నప్పటికీ మంత్రులు, ఎమ్మెల్యేలకు మాట్లాడే దమ్ములేదని విమర్శించారు. విద్యుత్ సరఫరా విషయంలో తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. కరెంట్ ఎప్పుడొస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని అయోమయ పరిస్థితి అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా 24 గంటలు నాణ్యమైన కరెంట్‌ను సరఫరా చేసినట్లు తెలిపారు. గతంలో సమైక్యాంధ్ర పాలనలో ఎలా ఉందో ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అలాగే ఉందని, తెలంగాణ ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యేలు భాస్కర్ రావు, నోముల భగత్ నాయకులు కేసాని లింగారెడ్డి, రమావత్ దస్రునాయక్, తులసిరాం, స త్యం, రావుల వెంకటయ్య, తోటపల్లి శ్రీను, దాచేపల్లి నరేందర్, పాండు పాల్గొన్నారు.

కరువు నేలపై కరుణ

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వం నిధులు కేటాయించి పనులు చేపడితే ఏన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు ఊరట లభించనుంది. ప్రభుత్వం ప్రతీ మండలంలో మహిళలతో రైస్ మిల్లులు, మినీ గోదాములు ఏర్పాటు చేయిస్తామని, ఐకేపీ కేంద్రాల ద్వారా ధాన్యాన్ని సేకరించి మహిళలతో మిల్లింగ్ చేయిస్తామని ప్రకటించింది. స్వయం సహాయక సంఘాల ద్వారా ఎఫ్‌సీసీకి చేరేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించింది. జిల్లాలో ధాన్యం దిగుబడి పెద్దఎత్తున అవుతుంది. ప్రభుత్వ నిర్ణయంతో మహిళలకు, స్వయం సంఘాలకు ప్రయోజనం చేకూరనుంది.

మూసీ సాగునీటి కాల్వల పునరుద్ధరణకు రూ.266.65కోట్లు

మూసీ ప్రాజెక్టు పరిధిలోని బునాదిగాని కాల్వ పునరుద్ధరణ పనులకు రూ.266.65కోట్లు పాలనాపరమైన అనుమతులు ప్రభుత్వం ఇచ్చిందని ఆర్థిక శాఖ మంత్రి ప్రకటించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో మూసీ పరివాహక ప్రాంతంలోని ప్రాజెక్టు కింద బునాదిగాని కాల్వతోపాటు పిలాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వల పునరుద్ధరణ నిధులు ఖర్చు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. హైదరాబాద్ శివారు జిల్లాల్లో భారీ వర్షాలు కురియగానే యాదాద్రి భువనగిరి జిల్లాలో మూసీ పరవళ్లు తొక్కుతుంది. ఈ వరద నీటిని సాగునీటికోసం వినియోగించుకోవాలనే ఉద్దేశ్యంతో ఈ కాల్వలను నిర్మించాలని 2003లో అప్పటి ప్రభుత్వం పనులు ప్రారంభించింది. మొట్టమొదటిసారి ధర్మారెడ్డి కాల్వ నిర్మాణానికి రూ.40లక్షలు కేటాయించింది. ఈ నిధులతో రైతుల పొలాలు నష్టపోకుండా గెట్టు ద్వారా చెరువుల్లోకి నీటిని మళ్లించారు. అయితే నీరు అధిక మొత్తంలో రావడంతో కాల్వ పరిధిని పెంచాలని ప్రతిపాదనలు సిద్ధంచేసి, మరో రూ.7లక్షలు మంజూరు చేసింది. అయితే వీటిలో కాల్వల నిర్మాణం వరకు పూర్తిచేశారు. అయితే కాల్వలకు తగినట్టుగా కల్వర్టులు నిర్మించకపోవడంతో నీరు చెరువుల్లోకి కాకుండా కత్వనుంచి నేరుగా వాగుల్లోకి వెళ్తుంది. దీంతో తెలంగాణ ఏర్పడిన తర్వాత ఈ కాల్వలను పునరుద్ధరించి, 60 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు 2016లో కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. ఈ కాల్వల ద్వారా భూదాన్‌పోచంపల్లి, వలిగొండ, భువనగిరి, రామన్నపేట, చౌటుప్పల్, చిట్యాల, నకిరేకల్, మండలాలకు సాగునీరు అందుతుంది. 2017లో ఈ మూడు కాల్వల నిర్మాణానికి ప్రభుత్వం రూ.284.85కోట్లు మంజూరు చేసింది. ప్రస్తుతం ఐదు మీటర్లుగా ఉన్న కాల్వను 10మీటర్లుగా వెడల్పు చేయడంతో పాటు కాల్వర్టుల నిర్మాణం, భూసేకరణకు నిధులు కేటాయించింది. పూర్తిస్థాయిలో కల్వర్టులు నిర్మించలేదు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో కాల్వల పునరుద్ధరణ పనులు సంపూర్ణంగా పూర్తయితే రెండు జిల్లాల్లో 98 కిలోమీటర్ల వరకు 60 వేలకు పైగా ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉంది.

ఇంటి వద్దకే భద్రాద్రి రాములోరి తలంబ్రాలు

నల్లగొండ టౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామనవమి సందర్భంగా భద్రాద్రిలో నిర్వహించే సీతారామచంద్రస్వామి కల్యాణం, ముత్యాల తలంబ్రాలు భక్తులకు పోస్టు ద్వారా అందించేందుకు పోస్టల్ శాఖ చర్యలు చేపట్టింది. అయితే స్వామి వారి కల్యాణానికి వెళ్లలేని వారికి తలంబ్రాలు పోస్టు ద్వారా తెప్పించుకునే తపాలా శాఖ ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా అవకాశం కల్పిస్తోంది. భక్తులు వారి సమీప పోస్టాఫీసులో రూ. 450 చెల్లించి అంతరాలయ అర్చన , కళ్యాణ తలంబ్రాలు పోస్టు ద్వారా తెప్పించుకోవచ్చు. అలాగే ముత్యాల తలంబ్రాలు కావా ల్సిన భక్తులు వారి సమీప పోస్టు ఆఫీసులో రూ.150 చెల్లించి పోస్టు ద్వారా తీసుకోవచ్చు. ఈ అవకాశం కేవలం ఏప్రిల్ 1 వరకు అన్ని పోస్టు ఆఫీసుల్లో, ఉత్తరాలు బట్వాడా చేసే పోస్టుమ్యాన్ ద్వారా లభ్యమవుతాయని సూపరింటెండెంట్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని భక్తులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్టీసీ కార్గోలో..

దేవరకొండ : సీతారామచంద్రస్వామి కల్యా ణ తలంబ్రాలు ఆన్‌లైన్‌లో లేదా ఆర్టీసీ కార్గో పార్శిల్ సర్వీస్‌లో గాని రూ.151 చెల్లిస్తే ప్రజలకు ఇంటి వద్దకు పంపిస్తామని ఆర్టీసీ నల్లగొండ రీజినల్ మేనేజర్ జాన్‌రెడ్డి అన్నారు. దేవరకొండ డిపోలో బుధవారం సీతారామస్వామి కల్యాణ తలంబ్రాల బుకింగ్ కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రయాణికులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే శ్రీరామనవమికి భద్రాచలం ఆలయానికి దేవరకొండ, నల్లగొండ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్ఎం తెలిపారు. కార్యక్రమంలో దేవరకొండ ఆర్టీసీ డిపో మేనేజర్ తల్లాడ రమేష్‌బాబు, అసిస్టెంట్ మేనేజర్ సైదులు, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

సాగర్ ప్రధాన డ్యాం వద్ద అగ్నిప్రమాదం

నాగార్జునసాగర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నాగార్జున సాగర్ ప్రధాన డ్యాం వద్ద బుధవారం సాయంత్రం షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించింది. సాగర్ ప్రాజెక్టు ఈఈ మల్లికార్జున్‌రావు తెలిపిన వివరాల ప్రకారం... నాగార్జునసాగర్ ప్రధాన డ్యాంకు దిగువన ఉన్న వ్యూ పాయింట్ వద్ద సాయంత్రం వేళ విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ఆ మంటలు క్రమంగా వ్యాపిస్తూ ప్రధాన డ్యాం గేటు వద్ద ఉన్న శివం పార్కు వరకు వచ్చాయి. దీంతో ప్రధాన డ్యాం కట్టకు ఉన్న ఎండిన కార్పెట్ గడ్డికి అంటుకుని మంటలు ఉవ్వెత్తున ఎగిసి కట్ట వెంట, శివం పార్కు పరిసరాలకు వ్యాపించాయి. మంటలు వ్యాపించడం చూసిన సీఆర్‌పీఎఫ్ సిబ్బంది ఎన్ఎస్పీ అధికారులకు తెలియజేశారు. దీంతో అప్రమత్తమైన ఎన్నెస్పీ అధికారులు జెన్‌కో, ఎన్నెస్పీ, ఎస్పీఎఫ్, నీటిపారుదల శాఖ సిబ్బంది, పోలీసులు పైపులతో నీటిని చిమ్ముతూ మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. గాలులు వేగంగా వీస్తుండటంతో మంటలు అదుపులోకి రాలేదు. సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు కిలోమీటరు మేర మంటలు వ్యాపించడంతో కట్టకు ఉన్న గడ్డితో పాటు సీసీ కెమెరా కేబుల్స్, విద్యుత్ తీగలు అన్ని కాలిపోయాయి. చీకటి పడటంతో నష్టం ఎంతమేరకు జరిగిందనేది గురువారం ఉదయం పరిశీలించి అంచనా వేస్తామని ఈఈ తెలిపారు. కిలో మీటరు మేర మంటలు వ్యాపించడంతో జెన్‌కో కార్యాలయంలో ఉన్న ఫైరింజన్‌ను తీసుకువచ్చి మూడు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చినట్లు ఈఈ పేర్కొన్నారు.



నాగార్జునసాగర్ ప్రధాన డ్యాం వద్ద చెలరేగిన మంటలు

ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులకు ప్రాధాన్యం

(5వ పేజీ తరువాయి)

మిగిలిన 10 నియోజకవర్గాలకు ఈ స్కూళ్లు రాబోతున్నా యి. 25 ఎకరాల విస్తీర్ణంలో ఒక్కో స్కూల్‌కు దాదాపు రూ.20కోట్ల వరకు నిధులు మంజూరవుతాయి. అదేవిధం గా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక అంబేడ్కర్ నాలెడ్జ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. దీని ద్వారా ఆ కేంద్రంలో ఆర్థికంగా వెనకబడిన విద్యార్థులకు గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షలపై శిక్షణ, స్టడీ మెటీరియల్ అందివ్వాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు.



మహాత్మాగాంధీ యూనివర్సిటీ అభివృద్ధి పనులకు రూ.35 కోట్లు

మహాత్మాగాంధీ యూనివర్సిటీకి ఈ బడ్జెట్‌లో రాష్ట్ర పథకాల ద్వారా వివిధ అభివృ ద్ధి పనులకు రూ.35కోట్ల నిధులను కేటాయించింది. ఈసారి యూనివర్సిటీ పనుల నిమిత్తం రూ.309కోట్లతో ప్రతిపాదనలు పంపిన విషయం తెలిసిందే. అయితే నేరుగా రాష్ట్ర పథకాల కింద రూ.35కోట్లు ప్రభుత్వం కేటాయించగా, కేంద్ర ప్రాయోజిక‌త రూ సా పథకానికి, ఇతర యూజీసీ పథకాలకు రాష్ట్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్లను ఈ బడ్జెట్‌లో కేటాయించడంతో ఈసారి ఈ పథకాల కింద కూడా ఎంజీయూకు తగిన నిధులు వస్తాయని తద్వారా ఉన్నత విద్యామండలికి ప్రతిపాదించిన పనులకు మోక్షం లభించవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. రూసాపై జరిగే సమీక్ష తర్వాత ఈ నిధుల కేటాయింపులపై స్పష్టత రానుందని పేర్కొన్నారు.

ప్రాజెక్టు	2024-25 అంచనా	2024-25 సవరణ	2025-26 ప్రతిపాదనలు
ఎస్ఎల్‌బీసీ	799.90	799.90	899.90
డిండి లిఫ్ట్	300.00	300.00	400.00
మూసీకాల్వలు	4.00	4.00	266.65
ఎస్ఆర్ఎస్పీరెండోదశ	34.01	34.01	34.01
శ్రీశైలందిగువ	3.89	3.89	2.01
నాగార్జునసాగర్	96.07	96.07	297.95
డిండి ప్రాజెక్టు	2.00	2.00	2.00
మూసీ ప్రాజెక్టు	64.00	64.00	50.00
ఎత్తిపోతలపథకాలు	158.30	158.30	208.77

బడ్జెట్ సమావేశాల్లో మన నేతలు











అసెంబ్లీలో బుధవారం రాష్ట్ర బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన మంత్రి, మండలి స్పీకర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కనిపించారు ఇలా..

రైతులు ముందస్తు ప్రణాళికతో పంటలు సాగు చేసుకోవాలి

మునుగోడురూరల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రైతులు ముందస్తు ప్రణాళికతో పంటలను సాగు చేసుకోవాలని ఏవో పద్మజ పేర్కొన్నారు. మండలంలోని కల్వలపల్లి గ్రామంలో బుధవారం సాగుచేసిన వరి పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ రైతులకు పలు సూచనలు చేశారు. అధిక పెట్టుబడులు పెట్టి నష్టపోవద్దని ప్రస్తుతం ఉన్న నీటిని పొదుపుగా వాడుకోవాలని రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధికారులు ఎం.నరసింహ, రైతులు మల్లేష్, శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

భక్తిశ్రద్ధలతో బంగారు మైసమ్మ తల్లికి బోనాలు

కేతేపల్లి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పలపహాడ్ బస్‌స్టేజీ వద్ద గల బంగారు మైసమ్మ ఆలయ 8వ వార్షికోత్సవంలో భాగంగా బుధవారం భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. అందంగా అలంకరించిన బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలను సమర్పించారు. అనంతరం భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమాల్లో ఆలయ నిర్మాణదాత, కమిటీ చైర్మన్ యాదగిరిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

విధి లేక వీధుల్లో వ్యాపారాలు

» రోడ్లపైనే అమ్మకాలు నిర్వహిస్తున్న చిరువ్యాపారులు » స్థిరత్వం లేని వ్యాపారం
» రైతుబజారు, సమీకృత మార్కెట్ నిర్మించని తప్పని వెతలు » రుణాలు ఇచ్చేందుకు బ్యాంకుల వెనకడుగు


ప్రకాశంబజార్‌లో రోడ్ల వెంట విక్రయిస్తున్న వ్యాపారులు, నిరుపయోగంగా సమీకృత మార్కెట్

నల్లగొండ టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కూరగాయల విక్రయాలకు ప్రత్యేక స్థలాలు లేకపోవడంతో వీధి వ్యాపారులకు అవస్థలు తప్పడం లేదు. రైతుబజార్, సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్లు ఏర్పాటు చేసినా నిరుపయోగంగా మారాయి. దీంతో ప్రత్యేక స్థలాలు లేకపోవడంతో కూరగాయల వ్యాపారులు, ఇతర అమ్మకందారులు తప్పనిసరి పరిస్థితుల్లో రోడ్డు వెంట వ్యాపారులు కొనసాగించాల్సి వస్తుంది. పట్టణంలోని ప్రకాశంబజార్‌లో కూరగాయల మార్కెట్ ఉన్నా అది పూర్తిగా హోల్‌సేల్ వ్యాపారులతో పాటు పెద్ద పెద్ద షాపులు నిర్వహించే వారికే పరిమితమైంది. అంతేకాకుండా ప్రతీ గురువారం నిర్వహించే సంతకు చిన్న చిన్న వ్యాపారులు సైతం వచ్చి విక్రయాలు నిర్వహిస్తున్నా అక్కడా స్థలాభావం కారణంగా ఆ రోజు అంగడిలో బండి బయటకు వెళ్లాలంటే వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీంతో స్థానికంగా ఉండే వినియోగదారులు వారాంతపు సంతకు రావాలంటే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇకపోతే బీట్ మార్కెట్ సమీపంలో ఏర్పాటు చేసిన రైతుబజార్ చిన్నగా ఉండటం, ఇప్పటికే అక్కడ కొంత మందికి వ్యాపారులకు షాపులు కేటాయించడంతో అక్కడా రద్దీ తప్పడం లేదు. ఇకపోతే నల్లగొండ నియోజకవర్గంలో ని కనగల్, తిప్పర్తి నల్లగొండ మండలాలతో చుట్టుపక్కల గ్రామాల్లో రైతులు పండించిన కూరగాయ పంటలను విక్రయించుకునేందుకు మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో చేసేదేమీ లేక ప్రకాశంబజార్‌తో పాటు రామగిరి, శివాజీనగర్, హైదరాబాద్‌రోడ్డు, దేవరకొండ రోడ్డులతో పాటు ప్రధాన కూడళ్ల వద్ద తాత్కాలిక ఏర్పాట్లు చేసుకొని వ్యాపారులు కొనసాగిస్తున్నారు. ప్రకాశంబజార్‌లో మాత్రం షాపుల ముందర ఉదయం నుంచి షాపులు తీసే సమయం ఉదయం 10 గంటల వరకు విక్రయాలు నిర్వహించుకోవాల్సి వస్తుంది. ఇందులో కూడా వారు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఇబ్బందులు తప్పడం లేదు



నేను 10 సంవత్సరాలుగా పట్టణంలో కూరగాయల వ్యాపారం నిర్వహిస్తున్నాను. కూరగాయలు అమ్మేందుకు మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో ప్రకాశంబజార్‌లో షాపుల ముందు రోడ్ల వెంట విక్రయిస్తున్నాను. ఉదయాన్నే వచ్చి షాపులు తెరిచే సమయం వరకు విక్రయిస్తాను. మాకంటూ ఒక ప్రత్యేక మార్కెట్ ఉంటే ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మకాలు చేసుకుంటాం.

- రొయ్య సులోచన, పర్వతగిరి, కనగల్

మార్కెట్ సౌకర్యం కల్పించాలి



నేను 25 సంవత్సరాలుగా కూరగాయల వ్యాపారం చేస్తున్నాను. కానీ ఇంత వరకు మాకు ఎలాంటి అడ్డా లేకపోవడంతో నిత్యం బాధలు తప్పడం లేదు. బ్యాంకు వారిని అడిగితే మీకు షాపే లేనప్పుడు ఏం చూసి లోన్ ఇస్తారని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా కుటుంబపోషణ కోసం మేము పడే కష్టాలను గుర్తించి మాకు మార్కెట్ సౌకర్యం కల్పించాలి.

- కండె నర్సమ్మ, వెలుగుపల్లి, నల్లగొండ

ప్రారంభానికి నోచుకోని మార్కెట్లు

» వీధి వ్యాపారాల కోసం గత ప్రభుత్వ హయాం లో రూ.6 కోట్ల రూపాయల వ్యయంతో సమీకృత వెజ్ నాన్‌వెజ్ మార్కెట్‌ను నిర్మించారు.
» కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ జూనియర్ కళాశాల పక్కన రూ.1కోటి వ్యయంతో ఆధునిక రైతు బజార్‌ను ఏర్పాటు చేశారు.

దయ చూపిన బ్యాంకర్లు

వీధి వ్యాపారుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నా అవి వారి దరికి చేరడంలేదు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా), బ్యాంకర్ల చిన్నచూపు కారణంగా వారికి ఎలాంటి నిధులు మంజూరు కావడంలేదు. ముఖ్యంగా వీధి వ్యాపారులకు ఇచ్చే వ్యక్తిగత రుణాలకు వీరి అన్ని విధాలా అర్హులైనప్పటికి వీరికంటూ ఒక అడ్డా, దుకాణం లేకపోవడంతో బ్యాంకర్లు కూడా వీరికి లోన్లు ఇచ్చేందుకు సాహసం చేయడం లేదు. వర్షాకాలంలో వారి పరిస్థితి దారుణంగా ఉంటుంది. ఏమాత్రం చిన్న వర్షం కురిసినా ఆ రోజు అమ్మకాలను మానుకోవాల్సిన పరిస్థితి. వరుసగా రెండు మూడు రోజులు వర్షాలు పడితే ఉన్న కూరగాయలు కుళ్లిపోయి వ్యాపారులు నష్టపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు ప్రజాప్రతినిధులు చొరవ చూపి తమకు నిలువనీడ కల్పించాలని వేడుకుంటున్నారు.

ఆశాలకు రూ.8వేల కనీస వేతనం నిర్ణయించాలి


కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో పాల్గొన్న ఆశాలు

నల్లగొండటౌన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లకు ప్రభుత్వం రూ.18వేల వేతనం నిర్ణయించాలని, పీఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఆశావర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆశాల వేతనాలు పెంచడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పిస్తామని కనీస వేతనం రూ.18 వేలు పెంచుతామని, ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నట్లు తెలిపారు. కానీ అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్నా వారి గురించి పట్టించుకోవడం లేదని అన్నారు. ఎన్నిసార్లు ప్రభుత్వానికి అధికారులకు వినతిపత్రాలు సమర్పించినా ఫలితం లేకుండా పోయిందని అన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి.సలీం మాట్లాడుతూ కరోనాకాలంలో ఆశాల శ్రమను గుర్తించిన వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ఆశా వర్కర్లు గ్లోబల్ లీడర్స్ అని ఆశాలకు అవార్డును ప్రకటించిందన్నారు. కానీ మన కేంద్ర ప్రభుత్వం నేటికీ ఆశల శ్రమను గుర్తించలేదని, ఎన్‌హెచ్‌ఎం పథకానికి బడ్జెట్‌ను తగ్గిస్తుందన్నారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశా యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.మహేశ్వరి, టి.వెంకటమ్మ, సీఐటీయూ జిల్లా నాయకులు పెంజర్ల సైదులు, పోలే సత్యనారాయణ, భైరం దయానంద్, రవీందర్, ఆశా యూనియన్ నాయకులు రమావత్ కవిత, శైలు, విమల, పుష్పలత, జయమ్మ, స్వర్ణ, పార్వతమ్మ పాల్గొన్నారు.

30 ఏళ్ల పోరాటానికి దక్కిన ఫలితం వర్గీకరణ

● మాదిగ సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ కత్తుల జగన్


నల్లగొండలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కత్తుల జగన్, తులసీదాస్

నల్లగొండ టౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): 30 ఏళ్లుగా వర్గీకరణ కోసం జరుగుతున్న పోరాటానికి న్యాయం లభించిందని, ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించినందుకు ప్రభుత్వానికి, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, మాదిగ ఎమ్మెల్యేలకు మాదిగ సంఘాల జేఏసీ తరపున మాదిగసంఘాల జేఏసి జిల్లా చైర్మన్ కత్తుల జగన్, కత్తుల తులసీదాస్ కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎస్సీలో ఉప కులాలను మూడు గ్రూపులుగా విభజించి 15శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు వీలు కల్పించిన ఈ బిల్లుకు రాజకీయ పార్టీలకు అతీతంగా మద్దతు తెలపడం హర్షణీయమన్నారు. సమావేశంలో మాదిగ సంఘాల నాయకులు కత్తుల షణ్ముఖ కుమార్, జేఏసీ నాయకులు వంటపాక యాదగిరి, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ అధికార ప్రతినిధి పెరిక అంజయ్య, పెరిక హరిప్రసాద్, నాగుల నరసింహ, ఇరిగి ప్రసాద్, కత్తుల సందీప్ , బుర్రి స్వామి తదితరులు పాల్గొన్నారు.

శాలిగౌరారం, చిట్యాల, కనగల్: శాలిగౌరారం, చిట్యాల, కనగల్ ఎక్స్‌రోడ్డులో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అలాగే మాదిగ అమరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాణసంచాలు కాల్చి మిఠాయిలు పంచుకున్నారు. శాలిగౌరారంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోడ సునీల్‌మాదిగ, శాలిగౌరారం మండల ఇన్‌చార్జి కారుపాటి అంబేడ్కర్, బట్ట శ్రీను, బట్ట చిన్న సైదులు, మెలుగూరి సోమయ్య, వేముల శ్రీకాంత్, బాకీ వెంకన్న, మాచర్ల ప్రతాప్, వేముల వెంకన్న, పెండ్యాల వెంకన్న చిట్యాలలో మేడి శంకర్, ఎరసాని గోపాల్, నేముల పురుషోత్తం, మేడి కృష్ణ, జిట్ట రవి కనగల్‌లో కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పందుల రాజా, పెరిక వెంకన్న, పందుల మారయ్య, నర్సింహ్మ, కొండ నరేందర్, ఆదిమళ్ల సైదులు, సూరి, నాగార్జున, నరేష్ పాల్గొన్నారు.

క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్ కు స్థలాన్ని కేటాయించాలి

నల్లగొండ టౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్‌కు స్థలాన్ని కేటాయించాలని బుధవారం జిల్లా కలెక్టర్‌కు యునైటెడ్ క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్ కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. బరియల్ గ్రౌండ్ కి క్రిస్టియన్స్ చాలా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి కేటాయించడానికి హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో కమిటీ సభ్యులు టీఎస్ క్రిస్టోఫర్, రేఖల భద్రాద్రి, పసల శౌరయ్య, టీఎస్ విలియమ్స్, టిఏలీషా, ఎం సంజీవయ్య, కే మోజస్, సమర్పన్ కుమార్, ఎస్సీ జయప్రకాష్, ఏ ఆశయ, కే సంజీవ, ఆర్‌పి అబ్రహం, జెపి ప్రభు చరణ్, ఎస్ అభిషేక్ పాల్, ప్రవీణ్ కుమార్, ఎస్ ఆనంద ప్రసాద్, జీఆర్ జయచంద్, ఏం. లక్ష్మయ్య, ఏ. నతానియల్, వీజే. జేమ్స్, సుందర్, జాషువా నాడర్, డి శాంసన్, వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను పారదర్శకంగా చేపట్టాలి

కనగల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులను పారదర్శకంగా చేపట్టాలని అడిషనల్ డీఆర్‌డీఓ కె.నవీన్‌కుమార్ ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధిహామీ పనులపై ఓపెన్‌ఫోరం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులను కార్యదర్శులు ఎప్పటి కప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. మూడు గ్రామాల్లో జరిగిన ఉపాధి పనుల్లో పొరపాట్లు జరిగాయని గుర్తించిన అధికారులు సదరు టీఏలకు, ఎఫ్ఏలకు నోటీసులు అందజేసారు. కార్యక్రమంలో అంబుడ్స్‌మెన్ గౌరి, విజిలెన్స్ అధికారి వేణుగోపాల్‌రావ్, ఎంపీడీఓ జయరామయ్య, ఎంపీఓ సుమలత, ఏపీఓ సుధాకర్, ఇన్‌చార్జి ఈసీ మహేశ్వరం రమేష్ జీపీ కార్యదర్శులు, టీఏలు, ఎఫ్ఏలు తదితరులున్నారు.

సంక్షిప్తంగా

● నార్కట్‌పల్లి :మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు నకిరేకల్ ఎమ్మెల్యే సతీమణి వేముల పుష్ప పరీక్ష ప్యాడ్‌లను బుధవారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు దూదిమెట్ల సత్తయ్య, పాశం శ్రీనివాస్‌రెడ్డి, జెరిపోతుల భరత్, ప్రజ్ఞాపురం సత్తి, దోసపాటి ప్రసాద్, హెచ్‌ఎం డీ.రాములు పాల్గొన్నారు.

● శాలిగౌరారం : మాదారం, చిత్తలూరు, ఇటుకులపహాడ్, భైరవునిబండ జడ్పీహైస్కూళ్లలో చైత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో 100మంది పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడులు, పెన్నులు, స్కేళ్లు ఫౌండేషన్ చైర్మన్ యంగలి రామకృష్ణ గౌడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎనగందుల, వెంకన్న, మహబూబ్ రెడ్డి, జ్యోతి, రామాచారి, నాంపల్లి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లి: మండలంలోని బీ.వెల్లెంల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆశీర్వాద్ స్మార్ట్ ఇండియా ప్రోగ్రాంలో భాగం గా అయోడిన్ ఉపయోగాలపై పోషణ్ మేళా నిర్వహించారు. పాఠశాలలో వివిధ ఆరోగ్య స్టాళ్లను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఇంచార్జ్ హెచ్‌ఎం నరేశ్, ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ సిబ్బంది మనోహర్, వెంకన్న, సురేశ్, అనూరాధ, సురేశ్‌బాబులు పాల్గొన్నారు.

● శాలిగౌరారం : పాపురాలగూడెం(శాలిగౌరారం మార్కెట్) ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నర్సయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● చిట్యాల : మండలకేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని హెచ్‌ఎం మాధవి ఆకాంక్షించారు.

కేతేపల్లి: ఇనుపాముల, భీమారం, గుడివాడ గ్రామాలకు చెందిన జడ్పీ పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు ఆయా పాఠశాలల్లో బుధవారం వీడ్కోలు కార్యక్రమాలు నిర్వహించారు. ఇనుపాముల జడ్పీ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు స్థానికంగా నిర్వహిస్తున్న వెంగమాంబ క్రషర్స్ ప్రతినిధి చెరుకూరి చెన్నయ్య పరీక్ష ప్యాడ్‌లను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ముశం వెంకటేశ్వర్లు ఎ.బి క్షమయ్య, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కట్టంగూరు: కట్టంగూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 70మంది పదవ తరగతి విద్యార్థులకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నలగాటి ప్రసన్నరాజ్ ప్యాడ్‌లు, పెన్సిళ్లు, రబ్బర్‌లను బుధవారం ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి హెచ్‌ఎం ఆథోని, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నూక సైదులు, బీఆర్ఎస్ నాయకులు ఉట్కూరి ఏడుకొండల్, యాదయ్య, చిట్యాల రాజిరెడ్డి, మేకల రమేష్, తండు సోములు, నిమ్మనగోటి శివ, నాగయ్య ఉన్నారు.

23న రాష్ట్ర రైతు సంఘం జిల్లా మహాసభ

నల్లగొండరూరల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): చింతపల్లి మండల కేంద్రంలో మా ర్చి 23న సాయి సుమంగళి ఫంక్షన్‌హాల్‌లో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా 15వ మహాసభలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గురి జ రామచంద్రం తెలిపారు. పట్టణంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఎల్లమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ.19.71లక్షలు

కనగల్, మార్చి 19:(ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల రేణుకా ఎల్లమ్మ ఆలయ హుండీ ఆదాయాన్ని బుధవారం అధికారులు లెక్కించారు. నాలుగు నెలల కాలానికి రూ.19లక్ష 71 వేల 469 ఆదాయం సమకూరిందని జిల్లా ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ కె.భాస్కర్ తెలిపారు. కార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ బి.సుమతి, చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి, ఈవో జయరామయ్య, సీనియర్ అసిస్టెంట్ చంద్రయ్య, ఉపేందర్‌రెడ్డి, ఆలయ కమిటీ ధర్మకర్తలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీబీ ఫ్రీ ఇండియాను సాధించేందకు కృషి

● మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రామచంద్ర

నల్లగొండ టౌన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): టీబీ ఫ్రీ ఇండియాను సాధించటానికి వైద్య సిబ్బంది నిర్విరామంగా కృషి చేస్తున్నట్లు మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీనెలా వచ్చే టీబీ కేసులను జిల్లా టీబీ అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. వ్యాధి నిర్ధారణకు కావాల్సిన అన్ని పరీక్షలు, మందులు, సాంకేతిక సహకారం ఇస్తామని అన్నారు. పీజీ వైద్య విద్యార్థులు టీబీపై పరిశోధనలు చేస్తే వారికి ప్రోత్సాహకాలు వస్తాయని తెలిపారు. సమావేశంలో జీజీఎచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అరుణకుమారి, డీటీసీవో డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి, డాక్టర్ రవిప్రసాద్ వివిధ విభాగాల హెచ్‌వోడీలు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపై సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి

చిట్యాలరూర ల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదా రి మీదుగా వెళ్లే వాహనాల మ ళ్లింపుపై వాహనదారులకు తెలిసేవిధంగా సూచిక బోర్డులను ఏర్పా టు చేయాలని డీఎస్పీ శివరాంరెడ్డి అన్నారు. చిట్యాల మండలం పెద్దకాపర్తి వద్ద జరుగుతున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు, రహదారి ఇరుపక్కల నుంచి వాహనాల మళ్లింపును బుధవారం ఆయన పరిశీలించారు. ఇదిలా ఉండగా చిట్యాలలో కూడా ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు జరగనున్నందున అక్కడి పరిస్థితులను కూడా డీఎస్పీ ఆరా తీశారు. వాహనదారులు సహకరించాలని సూచించారు. ఆయన వెంట నార్కట్‌పల్లి సీఐ కె.నాగరాజు, చిట్యాల ఎస్ఐ ఎన్.ధర్మ పాల్గొన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్లు చేస్తే కఠిన చర్యలు

కట్టంగూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): తప్పుడు ధ్రువపత్రాలు, నకిలీ సర్టిఫికెట్లతో అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని ఆర్డీవో యారాల అశోక్‌రెడ్డి అన్నారు. మండలంలోని చెర్వుఅన్నారం రెవెన్యూ పరిధిలోని 6.18 ఎకరాల భూమి అక్రమ రిజిస్ట్రేషన్‌పై బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో విచారణ నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని తేలువారిగూడెం గ్రామానికి చెందిన వంగూరు చంద్రయ్యకు చెరువు అన్నారం రెవెన్యూ పరిధిలోని 155,157,161,162 సర్వే నెంబర్‌లో 6.18 ఎకరాల భూమి ఇద్దరు అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, వారు ఒప్పుకున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని కలెక్టర్‌కు నివేదించి రిజిస్ట్రేషన్ రద్దు చేస్తామని ఆర్డీవో తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ గుగులోతు ప్రసాద్, నాయబ్ తహసీల్దార్ సుకన్య, బాధితుడు వంగూరు రామ్మూర్తి, రవి ఉన్నారు.

కాంగ్రెస్ అంటేనే కరువుకు చిరునామా : చిరుమర్తి

నార్కట్‌పల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అంటేనే కరువుకు చిరునామా అని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఎద్దేవా చేశారు. మండలంలోని నెమ్మాని, జువ్విగూడెం, చిన్నతుమ్మలగూడెం గ్రామాల్లో ఎండిన వరి పంటలను బుధవారం ఆయన బీఆర్ఎస్ నేతలతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాగునీరందక రైతుల పొలాలు ఎండి అన్నదాతలు ఆందోళన చెందుతుంటే వారిని ఆదుకోవాల్సిన ప్రభుత్వం బాధ్యత మరిచి మొద్దు నిద్రపోతుందని విమర్శించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఎన్నడూ పంటలు ఎండిపోలేదని గుర్తు చేశారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి కరుణాకర్‌రెడ్డి, నాయకులు యానాల అశోక్‌రెడ్డి, మేకల రాజిరెడ్డి, యాదయ్య, భూపాల్‌రెడ్డి, శ్రీధర్, ఉపేందర్, అనంతరెడ్డి, బిక్షం, వెంకటయ్య, ఎల్లేష్ పాల్గొన్నారు.

బెట్టింగ్ యాప్‌లకు దూరంగా ఉండాలి


ట్రాక్‌సూట్‌లను అందజేసిన ఎస్ఐ క్రాంతికుమార్

నార్కట్ పల్లి, మార్చి19(ఆంధ్రజ్యోతి): యువత, విద్యార్థులు బెట్టింగ్ యాప్‌లకు దూరంగా ఉండాలని ఎస్ఐ దగ్గుల క్రాంతికుమార్ అన్నారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో నార్కట్‌పల్లి ఎస్‌పీఆర్ పాఠశాల జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. ఇదే పాఠశాలకు చెందిన ఎస్‌కే ఖలీల్ జిల్లా కబడ్డీ జట్టుకు అర్హత సాధించాడు. ఈ సందర్భంగా ఎస్ఐ తన సొంత ఖర్చుతో వారికి ట్రాక్ సూట్‌లను బుధవారం అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కొన్‌రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పాఠశాల డైరెక్టర్లు విష్ణుమూర్తి, ఉపేందర్‌రెడ్డి, ఉమామహేశ్వర్, పీడీ నరేందర్‌యాదవ్, కరాటే మాస్టర్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలను ప్రభుత్వం ఆదుకోవాలి

చిట్యాల, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అన్నదాతలను ఆదుకోవాలని బీజేపీ కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గసభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. చిట్యాల మునిసిపాలిటీ పరిధిలోని శివనేనిగూడెం గ్రామంలో బుధవారం ఎండిన వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టంపై సర్వే నిర్వహించాలని కోరారు.రాష్ట్రంలో వెంటనే ఫసల్ బీమా పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. చిట్యాల మండలానికి సాగు నీరందించే ధర్మారెడ్డి, పిలాయిపల్లి కాల్వలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వరి పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.30వేల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గుండాల నరేష్‌గౌడ్, నాయకులు నకిరేకంటి మొగులయ్య, కన్నెబోయిన మహాలింగం, మండల వెంకన్న, చికిలంమెట్ల అశోక్, శ్రీనివాస్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు స్వరాజ్యం


స్వరాజ్యం చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న సీఐ రాజాశేఖర్‌రెడ్డి, మల్లు అరుణ్‌రెడ్డి

నల్లగొండ రూరల్: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం వర్ధంతి సందర్భంగా ఎంవీఎన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణంలోని డీవీకే రోడ్డులోని సత్యావతి ఆస్పత్రిలో బుధవారం ఉచితంగా మోకాళ్ల చిప్ప మార్పిడి నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ రాజశేఖర్‌రెడ్డి, డాక్టర్ మల్లు అరుణ్‌రెడ్డి, వన్ టౌన్ ఎస్ఐ శంకర్, డాక్టర్ చైతన్య, డాక్టర్ సంపద, సత్యవతి వైద్యశాల ఎండి సత్యనారాయణ, కంప్యూటర్ శిక్షణ కేంద్రం ఫ్యాకల్టీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ, చిట్యాల, నార్కట్‌పల్లి కేతేపల్లి: సీపీఎం ఆధ్వర్యంలో మర్రిగూడ, చిట్యాల, నార్కట్‌పల్లి కేతేపల్లి మండలకేంద్రాల్లో మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య, రాములు, లక్ష్మి, రాఘవేంద్ర చిట్యాలలో పార్టీ నాయకులు జిట్ట సరోజ, అవిశెట్టి శంకరయ్య, బొబ్బల సుధాకర్‌రెడ్డి, అరూరి శ్రీను, ఐతరాజు నర్సింహ, నార్కట్‌పల్లిలో నాయకులు కొప్పు శ్రవణ్, కుమ్మరి శంకర్, అర్జం శ్రీనివాస్, ఆమనగంటి ఐలయ్య, దండు రవి, కట్ట రామచంద్రం, మిర్యాల రాములు, గోపి, కేతేపల్లిలో సీపీఎం నాయకులు బొజ్జ చినవెంకులు, లూర్దుమారయ్య, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్సీ సత్యానికి సన్మానం

నల్లగొండ రూరల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీగా ఎన్నికైన సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యాన్ని గురువారం సీపీఐ జిల్లా కార్యాలయం ఉదయం 11 గంటలకు సన్మానించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సన్మాన కార్యక్రమానికి సీపీఐ జాతీయ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు.

బడ్జెట్‌పై నేతల తలో మాట

నల్లగొండ: ప్రభుత్వం బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై నేతలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు.

అన్ని వర్గాల సంక్షేమానికి పెద్దపీట



ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అన్ని వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేసింది. విద్య, వైద్యం, వ్యవసాయ రంగానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించింది. రైతు భరోసా పథకానికి రూ.18వేలకు పైగా కేటాయించడం వల్ల వ్యవసాయం ఎంతగానో బలోపేతం చెందనుంది. నీటి పారుదల రంగానికి రూ.23వేల కోట్లకు పైగా కేటాయించడం హర్షణీయం.

● గుమ్ముల మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు

అంతా అంకెల గారడీ



ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ గణాంకాల గారడీగా ఉంది. బడ్జెట్ పూర్తిగా అవాస్తవం. మొత్తంగా కాస్తా బడ్జెట్ పెరిగినా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చడానికి అవసరమైన కేటాయింపులు జరగలేదు. ఈ బడ్జెట్‌ను వ్యతిరేకిస్తున్నాం. రాష్ట్రం ఆర్థిక సంక్షోభం వైపు వెళ్తుందనడానికి ఇది నిదర్శనం.

● డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, బీజేపీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు.

కాగితాలకే పరిమితం చేయకూడదు



ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులను కాగితాలకే పరిమితం చేయకుండా ప్రజా సంక్షేమం కోసం నిధులు కేటాయించాలి. కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయింపులను ఖచ్చితంగా విడుదల చేయాలి. ఇచ్చిన హామీలన్నింటికీ బడ్జెట్‌లో నిధుల కేటాయింపు చేయకపోవడం బాధాకరం.


● బండా నరేందర్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్

బడ్జెట్ సంక్షేమానికి ఖర్చు చేయాలి



బడ్జెట్‌ను పూర్తిగా ఖర్చు చేసి వెనకబడిన ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయాలి. ఎన్నికల హామీలను అమలుచేయడానికి నిధుల కేటాయింపు సరిగా లేవు. రైతు రుణమాఫీ, రైతుభరోసా నిధులను సాగు చేస్తున్న రైతులందరికీ ఎప్పటి వరకు చెల్లిస్తారో బడ్జెట్‌లో పేర్కొనలేదు.

● తుమ్మల వీరారెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442
యాదాద్రి : 1800 425 7106
సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.120	180	200
సూర్యాపేట	రూ.95	140	170
నల్లగొండ	రూ.100	145	180

ఉష్ణోగ్రత గరిష్ఠం 36.0 । కనిష్ఠం 19.4


సుందరీకరణకు నోచుకున్న మూసీ

కరువు నేలపై కరుణ

కరువు ప్రభావిత ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించేందుకు వీలుగా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుందని బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. ప్రభుత్వం సాగునీటి కాల్వలతోపాటు మూసీ పరివాహక ప్రాంతాల్లోని కాల్వల పునరుద్ధరణకు తగిన చర్యలు తీసుకుంటామని బడ్జెట్ ప్రసంగంలో వివరించారు. రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ప్రకటించారు. ప్రాధాన్యతా క్రమంలో ఏ, బీ కేటగిరీలు విభజించారు.

- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

- సాగు, తాగునీటిని అందిస్తామని ప్రభుత్వం ప్రకటన
- మూసీ ప్రాజెక్టు కింద కాల్వల పునరుద్ధరణ
- సాగునీటి రిజర్వాయర్ల ద్వారా నీటి సరఫరా
- యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ప్రత్యేక బోర్డు
- రాష్ట్ర బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి వెల్లడి

తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టును సేద్యంలోకి తీసుకు రావలన్నది ప్రభుత్వ ఉద్దేశమని, నల్లగొండ, యాదాద్రి భువనగిరి జిల్లాలోని కరువు ప్రభావిత ప్రాంతాలకు సాగునీటిని అందించేందుకు వీలు గా ఉదయ సముద్రం బ్రాహ్మణవెల్లెంల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును ప్రారభించామని వివరించారు. ఉదయం సముద్రం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి 6.70 టీఎంసీల నీటిని బ్రాహ్మణవెల్లెంల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు లిఫ్ట్ చేస్తామని, ఈ ప్రాజెక్టు ద్వారా 94 గ్రామాల్లో లక్ష ఎకరాలకు సాగునీరు, ఫ్లోరైడ్‌తో బాధపడుతున్న మునుగోడుతోపాటు పలు నియోజకవర్గాల్లోని 107 గ్రామాలకు తాగునీటిని అందిస్తారు.

టీటీడీ తరహాలో బోర్డు

ప్రజల మనోభావాలను గౌరవిస్తూ యాదాద్రిని తిరిగి యాదగిరిగుట్టగా ప్రభుత్వం ప్రకటించింది. యాదగిరిగుట్ట దేవాలయ విమానగోపురానికి మొత్తం 65 కిలోల బంగారంతో తాపడం పనులు పూర్తిచేసి, సంప్రోక్షణ మహోత్సవాన్ని నిర్వహించామన్నారు.టీటీడీ బోర్డు తరహాలో యాదగిరిగుట్ట టెంపుల్ బోర్డును ఏర్పాటు చేయనున్నామని ప్రకటించారు. అయితే యాదగిరిగుట్ట దేవాలయ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులేమీ కేటాయించలేదు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు మౌలిక వసతులు కల్పిస్తామని ప్రకటించింది....

- మిగతా 7వ పేజీలో...



'గంధమల్ల'కు నిధులు కేటాయించేనా..?

గంధమల్ల రిజర్వాయర్ నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించలేదు. సాగునీటి ప్రాజెక్టులను చేపట్టేందుకు ప్రభుత్వం ఏ, బీ కేటగిరీలు విభజిస్తున్నట్లు బడ్జెట్‌లో ప్రకటించింది. అయితే ఈ రిజర్వాయర్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయనుందా? లేదా? అన్నది స్పష్టం కాలేదు. ఈ రిజర్వాయర్ నిర్మాణంపై 2019 ఫిబ్రవరిలో ప్రభుత్వం భూసేకరణ నోటిఫికేషన్ జారీచేసింది. ఈ రిజర్వాయర్‌ను మొదటగా 9.8టీఎంసీలుగా నిర్మించేందుకు ప్రణాళికను సిద్ధం చేశారు. ఈ మేరకు 232 ఎకరాల అటవీ భూమిని సేకరించింది. నిర్మాణ పనులు ఓ కంట్రాక్టర్‌కు అప్పగించింది. ప్రధాన కాల్వ, డిస్ట్రిబ్యూటరీలకు 4,162 ఎకరాల భూమి అవసరం కాగా, రిజర్వాయర్ వల్ల 4,027 ఎకరాల భూమితోపాటు 1,568 ఇళ్లు ముంపునకు గురవుతున్నాయి. ఈ రిజర్వాయర్ నిర్మాణంతో గంధమల్ల, బచ్చలగూడెం, ఇందిరానగర్ గ్రామాలు పూర్తిగా ముంపునకు గురవుతుండగా వీరారెడ్డిపల్లిలో దాదాపు 1800 ఎకరాల వరకు భూములు కోల్పోయే అవకాశం ఉందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. నిర్వాసితుల నిరసన వ్యక్తం చేయడంతో 4.28 టీఎంసీలకు తగ్గించారు. దీంతో వీరారెడ్డిపల్లిని ముంపు నుంచి తప్పించారు. గత ప్రభుత్వంలో చేపట్టిన ప్రతిపాదనల్లో గంధమల్ల ముంపు గ్రామంగానే ఉంది. తాజాగా ప్రభుత్వం 1.5 టీఎంసీల సామర్థ్యానికి తగ్గించడంతో ముంపు గ్రామాలు లేకుండా...భూసేకరణ వేయి ఎకరాలకు పరిమితం చేసింది. రిజర్వాయర్ సామర్థ్యాన్ని తగ్గించడంతో త్వరలోనే పనులు చేపడ్తారని రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.


యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్

ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులకు ప్రాధాన్యం

- మే నెలాఖరుకు వైటీపీఎస్ ఐదు యూనిట్లలో విద్యుదుత్పాదన
- ప్రజల మనోభావాల మేరకు యాదగిరిగుట్టగా పేరుమార్పు
- ఉమ్మడి జిల్లా సాగునీటి ప్రాజెక్టులకు రూ.2161.29 కోట్ల నిధుల కేటాయింపులు

ఉపముఖ్యమంత్రి మల్లుభట్టివిక్రమార్క బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రాష్ట్ర ఆర్థికబడ్జెట్‌లో ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రాజెక్టులకు ప్రాధాన్యం దక్కింది. బడ్జెట్ ప్రసంగంలో జిల్లా ఇరిగేషన్ ప్రాజెక్టులు, మూసీకాల్వలు, యాదాద్రి థర్మల్ పవర్‌స్టేషన్, యాదగిరిగుట్ట ఆలయాల గురించి ఆర్థిక మంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. అదేవిధంగా రాష్ట్రస్థాయిలో ప్రభుత్వం తీసుకురాబోతున్న యంగ్‌ఇండియా స్కూళ్లు, ఏటీసీ కేంద్రాలు, నర్సింగ్, హెల్త్ సైన్స్ కాలేజీల్లోనూ జిల్లాకు ప్రాతినిధ్యం దక్కే అవకాశం కన్పించింది. జిల్లా ఇరిగేషన్ ప్రాజెక్టులకు రూ.2161.29 కోట్ల నిధులను ఈబడ్జెట్‌లో కేటాయించారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

నల్లగొండ,యాదాద్రి భువనగిరి జిల్లాల్లోని కరువు ప్రభావిత ప్రాంతాల్లో నీటిని అందించడానికి వీలుగా లక్ష ఎకరాల ఆయకట్టు, 107 గ్రామాలకు తాగునీరందించే లక్ష్యంతో బ్రాహ్మణ వెల్లంల ఎత్తిపోతల పథకం చేపట్టి వేగవంతంగా పనులు చేస్తున్నామని బడ్జెట్ ప్రసంగంలో డిప్యూటీ సీఎం ప్రత్యేకంగా ప్రస్తావించారు. అదేవిధంగా మూసీ పరిధిలోని బునాదిగానికాల్వ పునరుద్ధరణ పనులకు రూ.266.65కోట్ల నిధులతో పాలనా అనుమతులు ఇచ్చామని పేర్కొన్నారు. బునాదిగాని కాల్వతోపాటు పిలాయిపల్లి, ధర్మారెడ్డి పల్లి కాలువలకు ఈనిధులు వెచ్చిస్తామని పేర్కొన్నారు.

థర్మల్ పవర్‌ప్లాంట్‌లో అన్ని యూనిట్లలో విద్యుదుత్పాదన

దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద నిర్మిస్తోన్న నాలుగువేల మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్రాజెక్టుకు సంబంధించి గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన పర్యావరణ అనుమతులను తమ ప్రభుత్వం సాధించి ప్రాజెక్టు నిర్మాణానికి ఆటంకాలను తొలగించిందని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులో ఇప్పటికే రెండు యూనిట్లు సింక్రనైజ్ చేయగా, వచ్చే మే నెల నాటికి మొత్తం అయిదు యూనిట్లలో విద్యుదుత్పాదన చేపడతామని అసెంబ్లీలో డిప్యూటీ సీఎం పేర్కొన్నారు.

పెండింగ్ ఇళ్ల పూర్తికి నిధులు



ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని, ఇందుకోసం ప్రతీ ఇంటి కి రూ.4లక్షల నిధులు మం జూరు చేస్తామని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో దీని ప్రకారం 42వేల పేద కుటుంబాల కు ఇందిరమ్మ ఇళ్లు ఈ సంవత్సరం రాబోతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో నిర్మించి వదిలేసిన, పాక్షిక నిర్మాణాలున్న అన్ని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పూర్తిచేసి అర్హులైన పేదలకు అందిస్తామని పేర్కొనడమేకాకుండా అందుకు అవసరమయిన నిధులను కూడా ఈ బడ్జెట్‌లో కేటాయించడంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న డబల్ బెడ్‌రూమ్ ఇళ్లకు మోక్షం లభించబోతుంది.

ప్రతీ నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్



ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే నల్లగొండ, మునుగోడు నియోజకవర్గాలకు ఈ స్కూళ్లు రాగా, తాజాగా...

- మిగతా 7వ పేజీలో...

సాగునీటి ప్రాజెక్టులకు రూ.2161.29 కోట్లు

ఉమ్మడి జిల్లా నల్లగొండ జిల్లాకు సంబంధించిన కీలక సాగునీటి ప్రాజెక్టులకు ఈ బడ్జెట్‌లో ఆశించిన మేర నిధులు కేటాయించారు. ప్రధానంగా ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుకు అధికంగా నిధులు కేటాయించగా, అతి స్వల్పంగా డిండి ప్రాజెక్టుకు నిధులు దక్కాయి. ఏఎమ్మార్పీ, బ్రాహ్మణవెల్లంల లిఫ్టు, ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ లైనింగ్ వంటి పనులన్నింటికీ ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు నిధులనుంచే ఇవ్వనుండడంతో ఈ ప్రాజెక్టు కింద కేటాయింపులు ఎక్కువగా ఉన్నాయి.


డిండి ప్రాజెక్ట్

ఆదమరిస్తే కన్నీరే

చెరువులు, వాగుల్లో పొంచి ఉన్న ప్రమాదం



చిన్నారుల ఆటలు పెద్దలకు శాపాలుగా మారుతున్నాయి. తెలిసీ తెలియని వయస్సులో వారు చెరువులు, బావుల్లో ఈతలకంటూ వెళుతూ ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. అల్లారు ముద్దుగా పెంచుకున్న బిడ్డలు మృత్యువాత పడుతుండడంతో ఆ తల్లిదండ్రుల రోధన వర్ణనాతీతం. వేసవి మొదలైన సందర్భంలో తల్లిదండ్రుల్లో అప్రమత్తత కలిగించేందుకు ఈ కథనం...

(ఆంధ్రజ్యోతి-డిండి, బీబీనగర్)

6

హైవేపై ప్రమాదాల నివారణకు చర్యలు

- ఎస్పీ శరత్ చంద్ర పవార్


కట్టంగూరులోని నల్లగొండ క్రాస్ రోడ్డును పరిశీలిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

కట్టంగూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నెం.65 జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు తగు చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ శరత్ చంద్రపవార్ తెలిపారు. కట్టంగూరులోని నల్లగొండ క్రాస్ రోడ్డు, మండలంలోని చెర్వుఅన్నారం క్రాస్ రోడ్డుతో పాటు నకిరేకల్‌లోని నగేష్ హోటల్ వద్ద ఉన్న ప్రమాదకరమైన బ్లాక్ స్పాట్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. సర్వీస్ రోడ్లను పూర్తి చేయాలని, అన్ని జంక్షన్ల వద్ద లైట్లు, జీబ్రా క్రాసింగ్‌లైన్లు, సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని నేషనల్ హైవే అధికారులకు సూచించారు రోడ్డు ప్రమాద నివారణపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఎస్పీ వెంట నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి, శాలిగౌరారం సీఐ కొండల్ రెడ్డి, కట్టంగూరు ఎస్ఐ రవీందర్, ఎన్‌హెచ్ఏఐ రెసిడెంట్ ఇంజనీర్ కిషన్‌రావు, నాగకృష్ణ, జోగేందర చౌదరి, రాము, సంజీవ చౌదరి ఉన్నారు.

విలేజ్ రోడ్డు సేఫ్టీ కమిటీల ఏర్పాటు

వేములపల్లి : జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు గ్రామస్థాయిలో విలేజ్ రోడ్ సేఫ్టీ కమిటీల ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ శరత్‌చంద్రపవార్ అన్నారు. వేములపల్లి రైతు వేదికలో రోడ్డు ప్రమాదాల నివారణకు ఏర్పాటు చేసిన మిషన్ రోడ్ సేఫ్టీ, రోడ్ రూల్స్, రోడ్ రెస్పాన్సిబిలిటి అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతీ పౌరుడు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలన్నారు. ఈ సందర్భంగా మిర్యాలగూడ ప్రాంతీయ వైద్యశాల డాక్టర్ రోహిత్ సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఎస్పీ రాజశేఖర్‌రాజు, రూరల్ సీఐ పీఎన్‌డీ.ప్రసాద్, డీటీఆర్‌బీ సీఐ అంజయ్య, ఎస్ఐలు డి.వెంకటేశ్వర్లు, లక్ష్మణ్, శ్రీకాంత్‌రెడ్డి, ఏఎస్ఐలు నరసింహారావు, రమణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

నా పేరు హిందీలో రాయగలరా?

» మీకు ఏ సబ్జెక్ట్ అంటే ఇష్టం » విద్యార్థులతో కలెక్టర్ ఇలాత్రిపాఠి » కస్తూర్బాగాంధీ పాఠశాలలో 30 నిమిషాలు పాఠాలు


కస్తూర్బాగాంధీ పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న కలెక్టర్

త్రిపురారం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పిల్లలూ మీకు ఏ సబ్జెక్ట్ అంటే ఇష్టం. నా పేరును హిందీలో రాయగలరా..? అనగా కొంత మంది విద్యార్థినులు రాసి చూపించారు. దాంతో విద్యార్థులకు చాక్లెట్లు అందజేశా రు. ఆమె ఏ ఉపాధ్యాయురాలో అనుకుంటున్నారా..? కాదండీ.. సాక్షాత్తు కలెక్టర్ ఇలా త్రిపాఠి. మండలంలోని కంపసాగర్ కస్తూర్బాగాంధీ పాఠశాలను బుధవారం సందర్శించారు. పదో తరగతిలో విద్యార్థులను పలు సబ్జెక్టుల్లో ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. గణిత శాస్త్రం, రసాయనశాస్త్రం బోధించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు.మండలకేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రి, తహసీల్దార్ కార్యాలయాల్లోని రికార్డులను పరిశీలించారు. ఆమె వెంట ఎంపీడీవో విజయకుమారి, తహసీల్దార్ ప్రమీల, వైద్యాధికారి శంకర్‌నాయక్, వ్యవసాయదికారి పార్వతిచౌహాన్, ఆర్ఐ సైదులు ఉన్నారు.

మెట్ట పంటల సాగుపై దృష్టి సారించాలి

చిట్యాల: నీటి సౌలభ్యం లేనందున రైతులు నీరు తక్కువగా అవసరముండే మెట్ట పంటలు, కూరగాయల సాగుపై దృష్టి సారించాలనీ కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. చిట్యాలలో అధునాతన పద్ధతుల్లో టమాట, పుచ్చకాయ సాగు చేస్తున్న కొంతం సత్తిరెడ్డి వ్యవసాయక్షేత్రాన్ని, అక్కడ ఉన్న ఫాంపాండ్‌ను పరిశీలించారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం

ఎమ్మెల్సీ, డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

నల్లగొండ టౌన్,మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్సీ, డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ అన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణకు శాసనసభ ఆమోదం తెలపడాన్ని హర్షిస్తూ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో సంబురాలు నిర్వహించారు. రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంపు కార్యాలయం నుంచి క్లాక్ టవర్ సెంటర్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు. పెద్దఎత్తున బాణాసంచా కాల్చారు. ఈ సందర్భంగా శంకర్ నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. రాహుల్ గాంధీ ఆదేశానుసారం బీసీలకు రాష్ట్రంలో 42శాతం రిజర్వేషన్ అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. దేశంలో మొట్టమొదటిసారి ఎస్సీ వర్గీకరణకు శాసనసభలో ఆమోదం తెలిపిందన్నారు. గత ప్రభుత్వాలు బీసీల రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణపై మోసం చేశాయన్నా రు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బోడ స్వామి, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకుడు గండి చెరువు వెంకన్న గౌడ్, ప్రాంతీయ రవాణా శాఖ డైరెక్టర్ కూసుకుంట్ల రాజిరెడ్డి, కాంగ్రెస్ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు దుబ్బ అశోక్ సుందర్, కత్తుల కోటి, పోలె జయ కుమార్, యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గాలి నాగరాజు పాల్గొన్నారు.

క్షీరాభిషేకం


కనగల్‌లో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న శంకర్‌నాయక్


హాలియాలో మంద కృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం తెలపడాన్ని హర్షిస్తూ అటు కాంగ్రెస్ నేతలు, ఇటు ఎమ్మార్పీఎస్ నేతలు జిల్లా వ్యాప్తంగా సంబురాలు జరుపుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంద కృష్ణ మాదిగల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

8

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:33 (గురువారం సాయంత్రం)
సహర్: 4:58 (శుక్రవారం ఉదయం)

పకడ్బందీగా 'పది' పరీక్షలు

- డీఈవో బొల్లారం భిక్షపతి


ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

పదో తరగతి వార్షిక పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాలతో వివిధ శాఖల సమన్వయంతో పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. ఏప్రిల్ 4వరకు జరగనున్నాయి. పరీక్షలకు 105 రెగ్యులర్, 3 ప్రైవేట్ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో డీఈవో బొల్లారం భిక్షపతితో 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూ..

- (ఆంధ్రజ్యోతి, నల్లగొండ)

ఆంధ్రజ్యోతి: పదోతరగతి పరీక్షల ఏర్పాట్లు పూర్తి చేశారా?

డీఈవో: పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. మొత్తం విద్యార్థులు ఒకరోజు ముందుగానే పరీక్ష కేంద్రం అడ్రస్‌ను తెలుసుకొని ఉంటే పరీక్ష రోజు కేంద్రానికి హాజరు కావడానికి ఇబ్బంది ఉండదు.

ఆంధ్రజ్యోతి : ఎంత మంది విద్యార్థులు హాజరుకానున్నారు?

డీఈవో: జిల్లాలో 18,825మంది పరీక్షకు హాజరుకానున్నారు. ఇందులో 18,666 మంది రెగ్యులర్, 159 మంది విద్యార్థులు ప్రైవేట్‌గా పరీక్షలు రాయనున్నారు. ఇందులో బాలురు 9,669 మంది, బాలికలు 8,997మంది ఉన్నారు.

ఆంధ్రజ్యోతి: నిమిషం నిబంధన అమలులో ఉందా?

డీఈవో: ప్రభుత్వ ఆదేశాల మేరకు 5నిమిషాలు అదనంగా ఆలస్యమైనప్పటికీ పరీక్ష కేంద్రానికి అనుమతిస్తాం. నిమిషం నిబంధన అమలులో లేదు. ప్రతీ విద్యార్థి గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవడానికి ప్రయత్నించాలి.

ఆంధ్రజ్యోతి: పరీక్షల నిర్వహణకు ఎంత మందిని కేటాయించారు?

డీఈవో: ఒక్కో పరీక్ష కేంద్రంలో ఒక చీఫ్ సూపరింటెండెంట్‌తోపాటు డిపార్ట్‌మెంటల్ అధికారి చొప్పున మొత్తం 105 మంది సీఎస్‌లు, మరో 105 మంది డీవోలను నియమించాం. 986 మందిని ఇన్విజిలేటర్‌లుగా నియమించాం.

ఆంధ్రజ్యోతి: పరీక్ష కేంద్రంలో ఎలాంటి నిబంధనలు అమలు చేస్తున్నారు?

డీఈవో: పరీక్ష కేంద్రాల్లోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదు. సీఎస్, డీవో ఇన్విజిలేటర్లు కూడా సెల్‌ఫోన్‌లు, ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించబోం. ఈ నిబంధన ఫ్లయింగ్ స్క్వాడ్‌లకూ వర్తిస్తుంది.

ఆంధ్రజ్యోతి: మెరుగైన ఫలితాలకు ఎలాంటి ప్రణాళికలతో సాగారు?

డీఈవో: గతేడాది 96.70శాతంతో రాష్ట్రంలో 9వ స్థానంలో నిలిచాం. ఈ సారి మరింత మెరుగైన ఫలితాలను సాధించడం కోసం విద్యా సంవత్సరంలో 7 నెలలనుంచే ప్రత్యేక కార్యాచరణ రూపొందించాం.

ఆంధ్రజ్యోతి: పరీక్షలు రాసే విద్యార్థులకు ఎలాంటి సూచనలు ఇస్తున్నారు?

డీఈవో: విద్యార్థులు ఒత్తిడి, ఆందోళనకు గురి కాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలను రాయాలి. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు విద్యార్థులకు అండగా ఉండి వారిని ప్రోత్సహించాలి. ఈసారి జవాబులు రాసేందుకు బుక్‌లెట్‌ల విధానం అమలులోకి వస్తుంది. మొత్తం 24 పేజీలు ఉంటాయి. బయోసైన్స్, ఫిజికల్ సైన్స్ పరీక్షలకు 12 పేజీల బుక్‌లెట్‌ను ఇస్తారు.

మూసీ కాల్వలకు నీటి విడుదల

కేతేపల్లి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మూసీ ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు నాలుగో విడత సాగు నీటిని అధికారులు మంగళవారం రాత్రి విడుదల చేశారు.ఎండల తీవ్రత పెరగడంతో ఆయకట్టులో సాగు చేసిన పంటలు ఎండే పరిస్థితులు నెలకొనడంతో కుడి కాల్వకు 290.70క్యూసెక్కులు ఎడమ కాల్వకు 307.80క్యూసెక్కుల చొప్పున నీటిని వదిలారు. ఈ విడతలో రెండు కాల్వలకు పంటకాలం పూర్తయ్యే వరకు నీటి విడుదల కొనసాగనుంది. కాగా 645 అడుగులు(4.46టీఎంసీలు) పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం గల మూసీ రిజర్వాయర్ నీటిమట్టం ప్రస్తుతం 629.44అడుగులు(1.32టీఎంసీలు)గా ఉంది.

నేడు ఎమ్మెల్యే బాలునాయక్ పర్యటన

చింతపల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి):మండలంలోని ఎం.మల్లేపల్లి, వీ.కే.మల్లేపల్లి, కిష్టరాయినిపల్లి, తక్కళ్లపల్లి గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బాలునాయక్ హాజరుకానున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగభూషణ్ బుధవారం తెలిపారు. గ్రామాల్లో సీసీ రహదారుల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చే చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఎల్ఆర్ఎస్ ఫీజు 25 శాతం రాయితీని వినియోగించుకోవాలి

హాలియా,మార్చి19(ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్ కోసం నమోదు చేసుకున్న ప్లాట్ల యజమానులకు ప్రభుత్వం 25 శాతం రాయితీని కల్పిస్తుందని హాలియా మునిసిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి తెలిపారు. అనుమతి లేని లే అవుట్లలో ఖాళీ ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకునేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. ఆస్తి, నీటి పన్నులను, వ్యాపార అనుమతి రుసుములను ఈ నెలాఖరులోగా చెల్లించి వడ్డీ భారాన్ని తగ్గించుకోవాలని ఆయన సూచించారు.

ట్రేడ్ లైసెన్స్ జారీలో నూతన విధానం


మిర్యాలగూడ మునిసిపాలిటీ కార్యాలయం

(మిర్యాలగూడ టౌన్)

ఆదాయం పెంపుపై దృష్టి సారించిన మునిసిపల్ శాఖ ఒక్కో అడుగు ఆచితూచీ వేస్తోంది. రాష్ట్రంలోని కార్పొరేషన్లతో పాటు మునిసిపాలిటీలలోని దుకాణ సముదాయాల్లో నిర్వహించే వాణిజ్య, వ్యాపారాలకు ట్రేడ్ లైసెన్స్‌లను జారీ చేయడంలో నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. అవకతవకలు జరగకుండా ఆయా దుకాణాల వివరాలను, అందించే లైసెన్స్‌లను ఆన్‌లైన్‌లో నమోదు చేయనుంది.

మిర్యాలగూడ పట్టణ పరిధిలో ఇప్పటికి 1753 ట్రేడ్ లైసెన్సులు ఉన్నట్లు మునిసిపల్ అధికారులు తెలిపారు. ఆయా దుకాణాలకు 2016లో నాటి కౌన్సిల్ తీర్మానం చేసిన ఫీజునే మొన్నటి వరకూ అమలు చేసేవారు. అంతేకాక 59 రకాల వ్యాపారాలకు ఒకే విధమైన ట్రేడ్ లైసెన్స్ ఉండేదని మునిసిపల్ అధికారులు పేర్కొంటున్నారు. మారిన నిబంధనల ప్రకారం వ్యాపారాన్ని బట్టి, దుకాణ సముదాయ కొలతల (విస్తీర్ణం)ను బట్టి లైసెన్స్‌లు డిజిటల్ విధానంలో జారీ చేయనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

ప్రతి ఒక్కరూ ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలి

పట్టణంలో వ్యాపారం చేసే ప్రతీ ఒక్కరూ ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలి. ఫీజు చెల్లించాలని, రెన్యువల్ చేసుకోవాలని ఆలోచించి అనుమతి పొందకుంటే నష్టపోతారు. ఒక వ్యాపారం పేరుతో అనుమతి పొంది మరో వ్యాపారం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

మహ్మద్ యూసుఫ్,
మునిసిపల్ కమిషనర్, మిర్యాలగూడ

సాగర్‌లో అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ


మూత లేని మ్యాన్ హోల్

(నాగార్జునసాగర్)

ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌లో (నందికొండ మునిసిపాలిటీలో) డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. సాగర్ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ఆరు దశాబ్దాల క్రితం కాలనీల్లో అంతర్గత డ్రైనేజీని పటిష్టంగా నిర్మించారు. పెద్ద పెద్ద పైపులైన్లు వేసి మ్యాన్‌హోల్స్ ఆరు అడుగుల లోతు కట్టారు. దీంతో ఏనాడు డ్రైనేజీలు, మ్యాన్ హోల్స్‌లలో సమస్యలు రాలేదు. అది అక్కడక్కడ దెబ్బతినడంతో 2015లో రూ.12కోట్ల వ్యయంతో నూతన డ్రైనేజీ లైన్‌లను ఏర్పాటుచేశారు. వాటి పనుల్లో నాణ్యత లేకపోవడంతో దశాబ్దకాలంగా మ్యాన్‌హోల్స్ పూడిపోవడంతో పాటు చిన్న పైపులైన్లు వేయడం వల్ల తరచూ బ్లాక్ అవుతున్నాయి. దీనికి తోడు మూడేళ్ల క్రితం సాగర్ కాలనీల్లో నూతనంగా సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు. దీంతో రోడ్డు మధ్యలో ఉన్న మ్యాన్ హోల్స్‌ను సరిగా ఏర్పాటు చేయకపోవడంతో ప్రతీ వీధిలో పదులసంఖ్యలో మ్యాన్‌హోల్స్‌పై మూతలు పగిలిపోయాయి. దీంతో మ్యాన్ హోల్స్‌లల్లో చెత్తాచెదారం నిండి మురుగునీరు మ్యాన్ హోల్స్ నుంచి బయటకు వస్తుంది. దీంతో దుర్గంధం వెలువడుతోంది. దీంతో వీధుల్లో స్థానికులు నడవాలంటే ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. అంతేకాక దోమలు పెరగడంతో ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు.

● నందికొండ మునిసిపాలిటీ పరిధిలో కాలనీలు, వీధుల్లో అక్కడక్కడ మ్యాన్ హోల్స్‌పై మూతలు పగిలిపోయాయని, మా దృష్టికి వచ్చిందని మునిసిపల్ కమిషనర్ శ్రీను తెలిపారు. మ్యాన్‌హోల్స్‌పై మూతలు ఏర్పాటు చేసి డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

నిరుపయోగంగా నీటి తొట్టెలు


కొంపెల్లి గ్రామంలో నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకున్న నీటి తొట్టె

(తిరుమలగిరి(సాగర్))

వేసవిలో మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు గత ప్రభుత్వం నిర్మించిన నీటితొట్లు ప్రస్తుతం మండలంలోని గ్రామాల్లో నిరుపయోగంగా మారాయి. క్షేత్రస్థాయి అధికారుల నిర్లక్ష్యంతో కొన్ని చోట్ల అవి శిథిలావస్థకు చేరాయి. గతంలో ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామాలు, తండాల్లో ప్రభుత్వం నీటితొట్టెలను ఏర్పాటు చేసింది. ప్రారంభంలో ఈ తొట్టిలను నీటితో నింపి మూగజీవాలకు దాహార్తిని తీర్చేందుకు చర్యలు చేపట్టారు. కానీ కొన్నేళ్లుగా తొట్టిల నిర్వహణను గ్రామ కార్యదర్శులు, సిబ్బంది పట్టించుకోకుండా గాలికి వదిలేశారు.

వృథాగా దర్శనమిస్తున్న నీటి తొట్టెలు

లక్షల రూపాయల వ్యయంతో మండలంలో నిర్మించిన నీటి తొట్టెలను వృథాగా మారాయి. వాటిల్లో చెత్తాచెదారం చేరి, కంపచెట్లు మొలిచి కొన్ని చోట్ల కూలిపోయి శిథిలావస్థకు చేరుకున్నాయి. వేసవికాలం సమీపించినా సంబంధిత నీటి తొట్టెలను శుభ్రపరిచి అవసరమైన చోట మరమ్మత్తులు చేసి వినియోగంలోకి తేవడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో మూగజీవాలకు దాహార్తిని తీర్చాలనే ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతున్న పరిస్థితి కొట్టొచ్చినట్లుగా కనిపిస్తుంది.

గ్రామాల్లో ఏర్పాటు చేసిన తొట్టిలను నీటితో నింపి మూగజీవాల దాహార్తిని తీర్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు, పశువుల, గొర్రెల కాపరులు కోరుతున్నారు. మేతకు వెళ్లిన క్రమంలో మూగజీవాలకు చాలా గ్రామాల్లో దాహార్తి తీర్చుకునేందుకు నీటి వసతి లేకపోవడంతో ఎండకు తల్లడిల్లుతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. వేసవి దృష్ట్యా నీటి తొట్టెలను వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.

మహిళాభివృద్ధికి ప్రభుత్వం కృషి


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ మహ్మద్ యూసుఫ్

మిర్యాలగూడటౌన్, మార్చి 19(ఆంధ్ర జ్యోతి): మహిళాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని మునిసిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ అన్నారు. కార్యాలయంలో బుధవారం రీసోర్స్ పర్సన్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళలు సాధికారత సాధించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక పథకాలు రూపొందించాయన్నారు. ఆస్తి, నీటి పన్ను చెల్లింపులపై రీసోర్స్‌పర్సన్లు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజలతో మమేకమయ్యే మహిళా సంఘాల సభ్యులు పట్టణాభివృద్ధికి సహకరించాలన్నారు. శ్రీనిధి జోనల్ మేనేజర్ అనంతకిషోర్ మాట్లాడుతూ రుణాలు చెల్లించాలన్నారు. రుణాలను వ్యక్తిగత అవసరాలకు వాడుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. సమావేశంలో శ్రీనిధి ఆర్ఎం శ్రీలేఖ, మెప్మా ఉద్యోగులు బక్కయ్య, వెంకటేశ్వర్లు, సతీష్ పాల్గొన్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

దామరచర్ల, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఈ నెల 21 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు నిర్వహించే పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో బాలాజీనాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దామరచర్ల జడ్పీ హైస్కూల్‌లో 149 మంది, కొండ్రపోల్ జడ్పీ హైస్కూల్‌లో 138, తెలంగాణ గిరిజన బాలికల పాఠశాలలో 180 మంది మొత్తంగా 467 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు.

వరి పొలాల సందర్శన

దామరచర్ల, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండ్రపోల్ గ్రామంలో రైతులు సాగు చేసిన వరి పొలాలను మండల వ్యవసాయాధికారి రుషేంద్రమణి బుధవారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరిలో మెడ విరపు తెగులు ఉన్నట్లు గమనించామని, దీని నివారణకు ట్రైసైక్లోజోల్ 0.6 గ్రాముల చొప్పున పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు. రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలని అన్నారు. కార్యక్రమంలో ఏఈవో అజ్మీరా సైదులు, రైతులు చిన్నసైదులు, గంగరాజు, శ్రీకాంత్, రమేష్, కోటయ్య, సతీష్ తదితరులు పాల్గొన్నారు.


హింగ్లా మాత ఆలయ నిర్మాణానికి రూ.2లక్షల విరాళం

కొండమల్లేపల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొర్రోనితండాలో నిర్మిస్తున్న హింగ్లామాత ఆలయ నిర్మాణానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వడ్త్య రమేష్‌నాయక్ బుధవారం రూ.2లక్షలు విరాళం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హింగ్లామాత ఆలయ నిర్మాణంలో పాలుపంచుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో బావోజీ ఖండ్యనాయక్, గోపాల్‌నాయక్, పూజారులు లచ్చిరాం, తుల్సిరాం, తండావాసులు బగుడు, కొమ్మ్య, చత్రియ, నామ, మోత్య, నాను, శంకర్, హతిరాం, లచ్చిరాం, నాగరాజు, చైతన్య, కోటేష్, నాగేష్, నీలాదర్ పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి కృషి

కొండమల్లేపల్లి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని జానిగానితండాలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో బాలురాజురెడ్డి తెలిపారు. గతకొంత కాలంగా తండాలో తాగునీటి సమస్య నెలకొనడంతో తండావాసులు ఎమ్మెల్యే బాలునాయక్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఆయన సమస్యను పరిష్కరించాలని ఎంపీడీవోకు సూచించారు. ఎంపీడీవో ఆదేశాల మేరకు అధికారులు బుధవారం గ్రామాన్ని సందర్శించి నీటి సమస్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. నీటి ఎద్దడికి తగిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. తండాను సందర్శించిన వారిలో మిషన్‌భగీరథ ఏఈ మాల్యాద్రి, పంచాయతీ కార్యదర్శి శోభ, మాజీ సర్పంచ్ మోత్యానాయక్ పాల్గొన్నారు.

విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి



దేవరకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

దేవరకొండ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): విద్యారంగానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించడం లో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బుడిగె వెంకటేష్ ఆరోపించారు. దేవరకొండ పట్టణంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం బడ్జెట్ పత్రాలను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ అసెంబ్లీలో విద్యారంగానికి ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు రమావత్ రాజేష్, గణేష్, నాయకులు శివ, అనిల్, రవి, విజయ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల సమస్యలు పరిష్కరిస్తా : ఆర్ఎం

చింతపల్లి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్టాండ్‌లో సమస్యలను పరిష్కరిస్తానని ఆర్టీసీ ఆర్ఎం జానారెడ్డి, డీఎం రమేష్ రాజు అన్నారు. మండలంలోని వెంకటేశ్వరనగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో సమస్యలపై 'సమస్యల ప్రాంగణం' అనే శీర్షికతో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. బుధవారం వెంటనే వెంకటేశ్వరనగర్(మాల్)లోని బస్టాండ్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ ప్రయాణికుల సమస్యలను పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. తాగునీటి వసతి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణ, తదితర సమస్యలు పరిష్కరించి బస్టాండ్‌లో మెరుగైన వసతులు కల్పించాలని సిబ్బందికి ఆదేశించారు.

రిజర్వేషన్ల బిల్లుకు ఆమోదంపై సంబురాలు


దేవరకొండ: సీఎం ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మిర్యాలగూడ, దేవరకొండ, డిండి, పెద్దఅడిశర్లపల్లి, కొండమల్లేపల్లి, చింతపల్లి, దామరచర్ల, హాలియా, నాగార్జునసాగర్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, ఎస్సీ ఉపకులాల వర్గీకరణ బిల్లుకు మంత్రివర్గం ఆమోదం తెలిపి అసెంబ్లీలో బిల్లు పాస్ చేసినందుకు మిర్యాలగూడ, దేవరకొండ డివిజన్‌లలో బుధవారం కాంగ్రెస్ శ్రేణులు, ఎమ్మార్పీఎస్ నాయకులు సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలుచోట్ల ర్యాలీలు నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యేల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణలో ప్రజాపాలన కొనసాగిస్తుందన్నారు. ఒకేరోజు రెండు చారిత్రాత్మక బిల్లులను అసెంబ్లీలో ప్రవేశపెట్టడంతో పాటు ఉభయసభలలో వాటిని ఆమోదించి రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలిపారని కొనియాడారు. రాబోయే స్థానిక సంస్థల అత్యధిక శాతం ఎస్సీ బీసీలు రాజకీయ పదవులు పొందేందుకు అవకాశం దక్కిందని అందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

● బీసీలకు 42శాతానికి పెంచిన రిజర్వేషన్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో అమలు చేయాలని బీసీ జేఏసీ నాయకుడు కోల సైదులు అన్నారు. మిర్యాలగూడలో బీసీ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పెద్ది శ్రీను, జయరాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

● బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు బంటు వెంకటేశ్వర్లు బిల్లుల ఆమోదంపై హర్షం వ్యక్తం చేశారు. మిర్యాలగూడ పట్టణంలోని బీసీ బాలుర వసతిగృహంలో విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. బీసీ యువజన సంఘం పట్టణ కార్యదర్శి దోనేటి శేఖర్, నక్కా నాగరాజు, శంకర్, చందు, రవి, సిద్దు పాల్గొన్నారు.

● దేవరకొండలో కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు నిర్వహించాయి. పట్టణంలో ర్యాలీ నిర్వహించి బస్టాండ్ ఎదుట అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే బాలునాయక్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి నేతలు మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లోకసాని శ్రీధర్‌రెడ్డి, సర్పంచుల ఫోరం రాష్ట్ర అధ్యక్షురాలు జూలూరి ధనలక్ష్మీబాలనారాయణగౌడ్, ఆలంపల్లి నర్సింహ, జాన్‌యాదవ్, అరుణ సురేష్‌గౌడ్, వెంకటేశ్వర్లు, యూనుస్, కొర్రరాంసింగ్ తదితరులు పాల్గొన్నారు.

● డిండి మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తా వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే బాలునాయక్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొంతినేని వెంకటేశ్వరరావు, నాయకులు బద్దెల శ్రీనివాస్, లక్ష్మణ్, శ్రీనివాస్‌గౌడ్, గడ్డమీది సాయి, కాశయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


దామరచర్లలో సీఎం చిత్రపటానికి క్షీభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

● పెద్దఅడిశర్లపల్లిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరబోయిన ఎల్లయ్యయాదవ్, అఖిల భారత యాదవ మహాసభ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు ముచ్చర్ల ఏడుకొండలుయాదవ్, ఎమ్మార్పీఎస్ నాయకులు మద్దిమడుగు రామస్వామి ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సతీష్‌రెడ్డి, బోడియానాయక్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● కొండమల్లేపల్లిలో నిర్వహించిన సంబురాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవరెడ్డి, సిరాజ్‌ఖాన్, కైసర్‌ఖాన్, బొడ్డుపల్లి సైదులు, బక్కలయ్య పాల్గొన్నారు.

● చింతపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణ్, మాజీ జడ్పీటీసీ హరినాయక్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్, గుణమోని కొండల్, జహంగీర్ పాల్గొన్నారు.

● దామరచర్లలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

మందకృష్ణ మాదిగ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

పద్మశ్రీ మంద కృష్ణమాదిగ 30సంవత్సరాల సుదీర్ఘ పోరాట ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ బిల్లు రాష్ట్ర అసెంబ్లీలో ఆమోదం పొందిందని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదించినందుకు హాలియా, నాగార్జునసాగర్‌లో ఆ సంఘం నాయకులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజీవ్, రాహుల్, లక్ష్మయ్య, ప్రవీణ్, అజయ్, వీరబాబు, నకుల్‌రావు పాల్గొన్నారు.

● హాలియాలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మంద కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు చింతల చంద్రారెడ్డి, గౌని రాజారమేష్‌యాదవ్, వెంకట్‌రెడ్డి, ముత్యాలు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

సాగునీటిని అందించి రైతులను ఆదుకోవాలి

మాడ్గులపల్లి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఏఎమ్మార్పీ వరద కాల్వ ద్వారా సాగునీటిని అందించి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు దేవిరెడ్డి అశోక్‌రెడ్డి అన్నారు. మండలంలోని దాచారం గ్రామంలో గల వరదకాల్వను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రస్తుతం వరద కాల్వ ద్వారా సాగునీటిని అందించకపోవడంతో మండలంలోని దాచారం, నారాయణపురం, కన్నెకల్‌తో పాటు పలు గ్రామాల్లో రైతులు సాగు చేసిన వందలాది ఎకరాల్లో పంట ఎండిపోతుందని, దీంతో ఆర్థికంగా తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఏప్రిల్ 20వ తేదీ వరకు వరద కాల్వ ద్వారా సాగునీటిని అందిస్తే పంటలు ఎండిపోకుండా కాపాడుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో పుల్లెంల శ్రీకర్, దేవిరెడ్డి మల్లారెడ్డి, వెంకటాచారి, జూకూరి నాగయ్య, దయాకర్, ఎలమంద, వెంకన్న, సైదులు, శ్రీనివాస్‌రెడ్డి, రాంరెడ్డి పాల్గొన్నారు.

స్వరాజ్యం స్ఫూర్తితో ఉద్యమించాలి

వేములపల్లి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ప్రజా ఉద్యమాలు చేయాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పోలెబోయిన వరలక్ష్మి అన్నారు. బుధవారం శెట్టిపాలెం గ్రామంలో మల్లు స్వరాజ్యం వర్ధంతి సభ నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. స్వరాజ్యం నాడు దొరలు, భూస్వాములకు వ్యతిరేకంగా పేద ప్రజల కోసం ఉద్యమాలు నడిపి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చిందన్నారు. నేడు ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా స్వరాజ్యం స్ఫూర్తితో ఉద్యమాలు చేయాలన్నారు. కార్యక్రమంలో శీలం పెద్దపద్మ, కోడిరెక్క లక్ష్మమ్మ, సైదమ్మ, శైలజ, జానకమ్మ, వెంకన్న, మట్టయ్య, నాగయ్య పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనర్సింహస్వామి డేగాట


స్వామివారి సేవలో పాల్గొన్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

వేములపల్లి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): దేశమంతా ఈ నెల 14 వ తేదీన ఘనంగా హోలీ వేడుకలను నిర్వహించుకుంటే మండలంలోని సల్కునూరు గ్రామంలో మాత్రం బుధవారం గ్రామంలో వెలిసిన స్వయంభూ లక్ష్మీనర్సింహస్వామికి డేగాట సందర్భంగా వసంతోత్సవం (హోలీ)ని ఘనంగా నిర్వహించుకున్నారు. గ్రామంలోని స్వయంభూ లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలను ప్రతి ఏటా పది రోజుల పాటు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా కల్యాణం తదుపరి ఐదవ రోజైన బుధవారం తెల్లవారుజామున అమ్మవారికి స్వామివారికి దోపును నిర్వహించారు. అనంతరం లక్ష్మీనరసింహ స్వామివారిని గ్రామంలోని గ్రామ సేవ నిర్వహించారు. తదుపరి గ్రామం మధ్యకు చేరుకొని డేగాట (కల్యాణంలో ఎదుర్కోళ్లలాంటిది) నిర్వహిస్తారు. ఈ సమయంలో వేదపండితులు యాజ్ఞికుల కోమండూరి తిరుమలచార్యులు, కాటూరి శ్రీధరచార్యుల ఆధ్వర్యంలో గ్రామస్థులు రెండు గ్రూపులుగా విడిపో యి ఒక గ్రూపు స్వామివైపు, మరో గ్రూపు చెంచులక్ష్మీ అమ్మవారి తరుపున రంగులతో డేగాట ఆడతారు. తదుపరి గ్రామస్థులు వసంతోత్సవంలో పాల్గొని రంగులు చల్లుకొని హోలీ వేడుకలు నిర్వహించుకోవడం ఆనవాయితీ. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి సేవలో పాల్గొన్నారు. గ్రామంలోని చిన్నపెద్ద అని తేడా లేకుండా అందరు ఆనందోత్సాహంగా రంగోలీని నిర్వ హించారు. కార్యక్రమంలో సల్కునూరు భక్త బృందం, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట


కొండపై కల్యాణమండపంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

● ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్

చింతపల్లి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మండలంలోని వెంకటేశ్వరనగర్ కొండపై నెలకొన్న శ్రీవారి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో పాల్గొని బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవచింతన కలిగి ఉండాలని ఆయన కోరారు. ఆలయ అభివృద్ధికి కోసం తన వంతుగా సహకారం అందిస్తానన్నారు.

వైభవంగా శ్రీవారి రథోత్సవ వేడుకలు

వీటీనగర్‌లోని కొండపై శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో హోమంతో పాటు ఉత్సవ విగ్రహాలను రథంపై ఏర్పాటు చేసి కుంభబలి తదితర కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవాలకు నల్లగొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, హైదరాబాద్, సాగర్, నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పూరె లక్ష్మణ్, ధర్మకర్తలు కోడిదూటి లక్ష్మ్మ జంగయ్య, చేపూరి నారాయణచారి, గడ్డం ఆంజనేయులు, మద్దెల కృష్ణగౌడ్, పూజారి పాండే, మాజీ ఎంపీపీ కొండూరి భవానీపవన్‌కుమార్, అంగిరేకుల గోవర్ధన్, అంగిరేకుల నాగభూషణ్, మాన భాస్కర్, ఎరుకుల వెంకటయ్యగౌడ్, ఎం.శేఖర్‌గౌడ్, సత్యసాయి భక్తులు పాల్గొన్నారు.

రాజ్యాధికారం దిశగా ముందుకు సాగాలి

● మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి


సభలో అభివాదం చేస్తున్న మాలమహానాడు నాయకులు

మిర్యాలగూడ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): దళితులంతా ఐక్యంగా ఉండి రాజ్యాధికారం దిశగా ముందుకు సాగాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి అన్నారు. పట్టణంలో బుధవారం నిర్వహించిన మాలల ఆత్మగౌరవ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్లను 15 నుంచి 25 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ప్రభుత్వం మాదిగలను విడగొట్టిందని అన్నారు. ప్రస్తుత ఎస్సీ జనాభా లె క్కలు తీసి మాల, మాదిగల సంఖ్య ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. రిజర్వేషన్లు వద్దు, రాజ్యాధికారమే ముద్దు అనే నినాదంతో దళితులంతా ఏకమై పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నల్లగొండ జిల్లా అధ్యక్షుడిగా బొప్పాని నగేష్ ఎన్నికయ్యారు. మిగతా కమిటీ సభ్యులను త్వరలోనే ఎంపిక చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాలమహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దగిరి కాంతయ్య, రాష్ట్ర అధ్యక్షుడు చిక్కుడు గుండాలు, రిటైర్డ్ ప్రొఫెసర్ రాజారావు, నాయకులు యనమల రాజ్‌కుమార్, లక్ష్మణ్, పున్నమ్మ, కోడిరెక్క శౌరి, తాళ్లపల్లి నాగయ్య, జోజి, వేణు, బాలకృష్ణ, లింగమయ్య సురేష్ పాల్గొన్నారు.

లెవీ త్వరగా పూర్తి చేయాలి

● పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రఘునందన్

పెద్దఅడిశర్లపల్లి, మార్చి19 (ఆంధ్రజ్యోతి): లెవీని సకాలంలో పూర్తి చేయాలని పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ మిల్లర్లకు స్పష్టం చేశారు. మండలంలోని గణేష్ రైస్‌మిల్లు, సాయితేజ రైస్‌మిల్లులను బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. మిల్లర్ల రైస్ వివరాల రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మరికొన్ని రోజుల్లో ధాన్యం సేకరణ కార్యక్రమం మొదలయ్యే అవకాశం ఉందని, అందుకు తగ్గట్టుగా మిల్లర్లు తమకు కేటాయించిన ధాన్యం నిల్వలకు సరిపడా స్థలం ఉండేలా చూడాలని సూచించారు. ప్రతీ 15 రోజులకు ఒకసారి రైస్‌మిల్లుల్లో ఉన్న ధాన్యం నిల్వల, లెవీ పూర్తి చేసిన వివరాలను పౌరసరఫరాల శాఖకు ఆయా మిల్లర్లు సమర్పించాలని స్పష్టం చేశారు.

డిండి రిజర్వాయర్ స్పిల్‌వే దిగువన క్షుద్ర పూజలు

డిండి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): డిండి ప్రాజెక్టు దిగువన ఉన్న వంతెన వద్ద మంగళవారం రాత్రి క్షుద్రపూజలు జరిపిన ఆనవాళ్లు కనిపించడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నల్ల మేకను గొంతుకోసి అక్కడే పడవేశారు. దీంతోపాటు నిమ్మకాయలు, కొబ్బరికాయలు, గుమ్మడికాయలను పగులగొట్టి, పసుపు, కుంకుమ చల్లారు. ఓ బస్తాలో క్షుద్రపూజలకు కావాల్సిన సామగ్రి ఉన్నట్లు తెలుస్తుంది.